



మళ్లీ మొదటికి..

- ఆర్‌యూలో టైం స్కేల్ ఉద్యోగుల వివాదం
- 17 మందిని విధుల్లోకి తీసుకునేందుకు ఉత్సాహం
- గతంలో ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగాల్లో చేరిక
- విద్యాశాఖ విచారణలో వెల్లడి
- అయినా విధుల్లోకి తీసుకునేందుకు చర్యలు?

కర్నూలు అర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలో టైం స్కేల్ ఉద్యోగుల వివాదం మళ్లీ మొదటికి వచ్చింది. 2018లో అప్పటి ఉపకులపతి 102 మంది కాంట్రాక్టు ఉద్యోగులను, ఒకే సర్వీసులో 5 సంవత్సరాలు పని చేసిన వారిని టైం స్కేల్ ఉద్యోగులుగా ప్రమోట్ చేశారు. కానీ టైం స్కేల్ ఉద్యోగుల్లో చాలా మంది 60 సంవత్సరాలకు పైబడిన వారు ఉండటం, ఫేక్ సర్టిఫికెట్లతో ఉద్యోగం తెచ్చుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో అప్పటి ఉపకులపతి ఇంటర్నల్ కమిటీతో నామమాత్రంగా విచారణ చేసి మమ అనిపించారు. అయితే పూర్తిస్థాయి కమిటీతో విచారణ చేపట్టాలని డిమాండ్లు వ్యక్తమయ్యాయి. దీంతో ఏడేళ్ల నుంచి టైం స్కేల్ ఉద్యోగుల ఫైల్‌పై వివాదాలు అలుముకున్నాయి. ఓ విద్యార్థి నాయకుడి ఫిర్యాదుతో అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్యామల రావు విచారణకు ఆదేశించారు. 42 మంది టైం స్కేల్ ఉద్యోగుల జాబితాను అప్పటి ఉపకులపతి ఆనందరావు కర్నూలు, నంద్యాల డీఈఓ (జిల్లా విద్యాశాఖాధికారులకు) టైం స్కేల్ ఉద్యోగుల జాబితా పంపారు. అందులో విచారణ అనంతరం 39 మంది ఫేక్ సర్టిఫికెట్‌గా నిర్ధారించారు. వాటిలో కర్నూలు డీఈఓ కార్యాలయం 17 మంది ఫేక్ అని నిర్ధారించి పంపడంతో వారిని అప్పటి వీసీ ఆనందరావు వారిని తొలగించారు. తాజాగా నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి మరో 22 మంది ఉద్యోగులకు సంబంధించి కూడా నకిలీ సర్టిఫికెట్లు అంటూ జాబితా సిద్ధం చేసి రాయలసీమ యూనివర్సిటీతో పాటు ఉన్నత విద్యామండలికి సిఫారసు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో మిగిలిన ఉద్యోగులపై కూడా వేటు పడే అవకాశం ఉందనే ప్రచారం యూనివర్సిటీలో జరుగుతోంది.

- కూటమి ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టు, టైం స్కేల్ ఉద్యోగుల జాబితాను సీఎఫ్ఎంఎస్‌కు పంపాలని స్టేట్ ఫైనాన్స్ అధికారులు ఆదేశించారు. కానీ రాయలసీమ యూనివర్సిటీలో టైం స్కేల్ ఉద్యోగుల జాబితా మాత్రం తిరస్కరించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ లేకుండా ఎక్స్‌టర్నల్ కమిటీ ఆమోదం లేకుండా అడ్డగోలుగా ఫేక్ సర్టిఫికెట్స్ పెట్టిన వారిపేర్లను కూడా పంపారు. వాటిని సరిచేసి అర్హత గల వారి టైం స్కేల్ ఉద్యోగుల పేర్లు మాత్రమే పంపాలంటూ రాష్ట్రస్థాయి అధికారులు తిరస్కరించడం చర్చనీయాంశమైంది.
- 102 మంది టైం స్కేల్ ఉద్యోగుల జాబితాను సామాజిక వర్గాల వారీగా పరిశీలిస్తే ఎస్సీ-54, బీసీ-27, ఓసీ-15, ఎస్టీ-6గా ఉన్నాయి. అయితే ఒకే సామాజిక వర్గానికి పెద్ద పీట వేసి కొన్ని సామాజిక వర్గాలకు అన్యాయం చేశారంటూ బీసీ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఉన్నత విద్యామండలి రాష్ట్ర స్థాయి వర్సిటీల రివ్యూ మీటింగ్‌లో అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్యామలరావు ఆర్‌యూలో ఉద్యోగులకు సంబంధించి అడ్డగోలు నిర్ణయాల తీరును ప్రస్తావించారు.

అలాంటిదేమీ లేదు

గతంలో తొలగించిన వారిని ఎలా తీసుకుంటాం. అలాంటిదేమీ లేదు. కానీ ఎవరినైనా ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాల్సి వస్తే ఉన్నత విద్యాశాఖ అనుమతులు మేరకే తీసుకుంటాం.
- వి.వెంకట బసవరావు, ఉపకులపతి, రాయలసీమ యూనివర్సిటీ

ఉపకులపతికి ఎందుకంత ఉత్సాహం

నంద్యాల జిల్లా విద్యాశాఖాధికారి సిఫారసు చేసిన జాబితాను తొక్కిపెట్టి తొలగించిన 17 మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఉపకులపతి ఉత్సాహం ప్రదర్శించడంపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. వివాదాస్పద ఉద్యోగులను తీసుకోవడంపై జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి కీలకంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులను తొలగించిందని వాళ్లను విధుల్లోకి తీసుకోవాలని కీలక ప్రజాప్రతినిధి మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లాడని ఆర్‌యూలో చర్చ సాగుతోంది. వివాదాస్పద ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని అదే ప్రజాప్రతినిధి ఉపకులపతిని కూడా కోరినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆ ఉద్యోగులవి ఫేక్ సర్టిఫికెట్లని జిల్లా విద్యాశాఖ నిర్ధారించిన నివేదికలు, పాలక మండలిలో తీసుకున్న నిర్ణయాలను కాదని విధుల్లోకి తీసుకునేందుకు ప్రయత్నించడం ఏమిటని పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఇందులో ప్రజాప్రతినిధి బంధువులు ఆరుగురితో పాటు ఆయన సామాజికవర్గం, సొంత గ్రామానికి చెందిన మరో 9 మంది ఉండటంతోనే ఒత్తిడి వేగవంతమైనట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఎలాగైనా అతి త్వరలోనే వివాద ఉద్యోగులను విధుల్లోకి తీసుకునేల పావులు కదుపుతున్నట్లు సమాచారం.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

- నిత్యావసరాలు అందుబాటులో ఉంచాలి
- సోషల్‌మీడియాలో అనవసర ట్రోల్స్ చేయకండి
- ఇన్‌చార్జి కలెక్టర్ బి.నవ్య



కర్నూలు కలెక్టరేట్, మే 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో అన్నివిభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ డా.బి.నవ్య అధికారులను ఆదేశించారు. శనివారం అధికారులతో సమావేశం నిర్వహించారు. విపత్తుల నిర్వహణ శాఖ అప్రమత్తంగా ఉండడంతో పాటు ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, హోంగార్డ్స్, పోలీసు, రెవెన్యూ, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, సివిల్ డిఫెన్స్ సిబ్బంది, హాస్పిటల్స్ తదితర విభాగాలు అన్ని సమన్వయంతో 24/7 పనిచేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. అవసరమైన వస్తువులు, రేషన్, మందులు, నూనె (ఇంధనం) తదితర నిత్యావసర వస్తువులను ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏదైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే ప్రజలను సురక్షిత ప్రదేశాలను తరలించడానికి ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. సోషల్ మీడియాలో అనవసరమైన పుకార్లు, ట్రోల్స్‌ను వ్యాపింపచేయకూడదని ప్రజలకు విజ్ఞప్తిచేశారు. ఎక్కడైనా పేలుడు పదార్థాలు ఉంటే పోలీసు, రెవెన్యూ శాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

4,700 ఉపాధ్యాయ బదిలీల ఖాళీలు

- 90శాతం పోస్టులను ఆన్‌లైన్‌లో ఎంట్రీ
- డీఈవో శామ్యూల్‌పాల్
- ఉమ్మడి జిల్లా విద్యా శాఖాధికారులతో సమావేశం

కర్నూలు ఎడ్యుకేషన్, మే 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ఉమ్మడి జిల్లాలో 4,700 ఉపాధ్యాయ బదిలీల ఖాళీలు ఉన్నాయని డీఈవో శామ్యూల్‌పాల్ అన్నారు. శనివారం స్థానిక మాంటిస్సోరి పాఠశాలలో ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారులతో ఉపాధ్యాయ బదిలీ ఖాళీలపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 4,700 ఉపాధ్యాయ ఖాళీలను ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేశామన్నారు. ఇందులో ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తయిన ఉపాధ్యాయులు, స్టడీలో ఉన్న ఉపాధ్యాయులు, దీర్ఘకాలికంగా లీవ్‌లో ఉన్నవారందరి పోస్టులను భర్తీచేయనున్నట్లు తెలిపారు. మొదటి రోజు 90శాతం పోస్టులను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేశామని, మిగిలిన 10శాతాన్ని ఆదివారం పూర్తి చేయనున్నట్లు డీఈవో వివరించారు. రాష్ట్రంలోనే అత్యధిక ఉపాధ్యాయ ఖాళీలు ఉన్న జిల్లా ఉమ్మడి కర్నూలు జిల్లానే అని తెలిపారు. ఇప్పటి వరకు అత్యధికంగా ఎంట్రీ చేసింది కూడా కర్నూలు జిల్లానే అని అన్నారు. ఖాళీలను ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేసి, ప్రభుత్వం అనుమతించాక ఉపాధ్యాయ ఖాళీలను ఆన్‌లైన్‌లో ఉంచుతామన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీల గైడెన్స్ ఇచ్చిన తర్వాత ఉపాధ్యాయుల బదిలీలకు ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉందన్నారు.



మాట్లాడుతున్న డీఈవో శామ్యూల్‌పాల్

కార్యక్రమంలో నంద్యాల జిల్లా డీఈవో జనార్దన్‌రెడ్డి, డిప్యూటీ డీఈవోలు, మండల విద్యాశాఖ అధికారులు, సూపరింటెండెంట్స్, సిబ్బంది ఉన్నారు.

సైనికుల సేవలు ఎనలేనివి

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- టీజీవీ కళాక్షేత్రంలో 'జై జవాన్' కల్చరల్ ఫెస్ట్ ప్రారంభం

6





భరతమాత చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

మిస్టరీ వీడేనా..?

- ఆంధ్రజ్యోతి కథనంతో కదిలిన పోలీస్ యంత్రాంగం
- సీఐ, ఇద్దరు ఎస్ఐలతో క్షేత్రస్థాయిలో పరిశీలన
- 23 ఎముకలు, దంతాలు తదితర వస్తువుల గుర్తింపు
- ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలింపు
- ఎట్టకేలకు కేసు నమోదు
- విచారణ అధికారిగా డీఎస్పీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పొలంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

నంద్యాల/గడివేముల, మే 10 (ఆంధ్రజ్యోతి): గడివేముల మండలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతికి సంబంధించిన సంఘటనలో పోలీసులు ఎట్టకేలకు స్పందించారు. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'పోలీస్.. ఇదేం తీరు..' కథనానికి జిల్లా పోలీసు యంత్రాంగం తీవ్రంగా స్పందించింది. పోలీసులు వ్యవహరించిన తీరుపై జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సీరియస్ అయ్యారు. ఈ నేపథ్యంలో సంబంధిత పోలీసులపై తమదైన శైలిలో ఆదేశాలు జారీ చేశారు. ఇదే క్రమంలో ఈ ఘటనపై లోతుగా దర్యాప్తు ముమ్మరం చేసి తగిన నివేదిక అందజేయాలని విచారణ అధికారిగా నంద్యాల సబ్ డివిజన్ డీఎస్పీ మంద జావలి అల్ఫోన్స్‌ను నియమించారు. ఎస్పీ ఆదేశాలతో పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐలు నరేంద్రరెడ్డి, నాగార్జునరెడ్డి, స్థానిక వీఆర్వో హరిశ్చంద్రుడు సిబ్బందితో కలిసి ఘటనా స్థలంలో శనివారం క్షుణ్ణంగా పరిశీలించారు. దీంతో సుమారు 23 ఎముకలు, పళ్ల (దంతాలు), దుస్తులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

మిగతా 7వ పేజీలో

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, మే 10 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అర్జీల పరిష్కారం సమాచారం కోసం 1100కు.. తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, ఏదశలో ఉందో తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నెంబర్ 1100కు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు.

ముచ్చటగా ముగ్గురు...!

- నందికొట్కూరులో అగ్నిమాక కేంద్రం భవన నిర్మాణానికి భూమిపూజ
- వేర్వేరుగా పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్
- మరోమారు తేటతెల్లమైన విభేదాలు



భూమిపూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధాకర్ రెడ్డి

నందికొట్కూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు నియోజకవర్గంలో రాజకీయ విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఇటీవల మున్సిపల్ చైర్మన్ అవిశ్వాస అంశంలో ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య వర్గపోరు బహిర్గతమైన విషయం తెలిసిందే. మళ్లీ ఇప్పుడు తాజాగా నందికొట్కూరులో ఓ భవన నిర్మాణానికి సంబంధించి భూమిపూజ విషయంలో అలాంటి సంఘటనే ఒకటి చోటు చేసుకుంది. శనివారం పట్టణంలోని బైరెడ్డి నగర్‌లో నియోజకవర్గ అగ్నిమాపక కేంద్ర నూతన భవన నిర్మాణం కోసం శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. అయితే ఈ కార్యక్రమానికి ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డిలు వేర్వేరుగా వేర్వేరు సమయాల్లో భూమిపూజ చేయడం హాట్ టాపిక్‌గా మారింది. ముందుగా ముహూర్తం దాటిపోతుందన్న నెపంతో ఉదయం 9:41 గంటలకు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి వార్డు కౌన్సిలర్ చాంద్‌బాషతో శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య 10:17 గంటలకు చేరుకుని మళ్లీ శంకుస్థాపన చేశారు. ఇక ఎంపీ బైరెడ్డి శబరి 11:02 గంటలకు చేరుకుని ముచ్చటగా మూడోసారి శంకుస్థాపన చేశారు. ఇదిలా ఉండగా శంకుస్థాపనల తంతు పూర్తి చేసేందుకు అగ్నిమాపక శాఖ అధికారులు తలలు పట్టుకోవాల్సి వచ్చింది. ఒకే పార్టీ నుంచి గెలిచిన వారు ఇలా వేర్వేరుగా పాల్గొనడం కేడర్‌లో గందరగోళానికి దారి తీసింది.




భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య



భూమిపూజ చేస్తున్న ఎంపీ శబరి

తుంగభద్ర తీరం సాహిత్యం



సాహితీ చరిత్రలో 'విస్మృత కార్యకర్త'ది ప్రత్యేక స్థానం

కర్నూలు కల్చరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్య చరిత్రలో 'గామాగో' రాసిన ఈ 'విస్మృత కార్యకర్త' ఒక ప్రత్యేక స్థానం పొందింది. బహూశా ఈ కాలం వారికి తెలియని ఆనాటి జిల్లా ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుల్లో గామాగో ఒకరు. ఆయన స్వాతంత్ర్యానంతరం కూడా విశాల భారతావనిలో విలీనం కాని నాటి 'బనగానపల్లె నవాబుల సంస్థానం'పై మళ్లీ పోరాటం చేసిన యోధుడు. అప్పటి సంస్థానం విలీనం కోసం చేసిన పోరాటాన్ని, ఈనాం భూముల రద్దు లకోసం జరిగిన 'కరివేన సత్యాగ్రహ పోరాటాన్ని సవివరంగా రికార్డు చేసిన పుస్తకం ఇది. 1918-2002 మధ్య జరిగిన దేశ రాజకీయాలను, ఆంధ్రదేశం మీదా వాటి ప్రతిఫలాలను, ఆనాటి నాయకుల ద్వంద వైఖరులను కళ్లకు కట్టినట్లు ఈ పుస్తకం వివరిస్తుంది.

గామాగో ఒక విశిష్టమైన వ్యక్తి. ఆనాటి కోవెలకుంట్ల తాలూకాలోని భీమునిపాడు గ్రామంలో 1918 అక్టోబరు 23న జన్మించిన ఆయన అసలు పేరు ముక్కమళ్ల వేంకట సుబ్బారెడ్డి. గాంధీజీ అహింసా సిద్ధాంతాన్ని, మార్క్స్ బోధించిన ఆర్థిక సిద్ధాంతాన్ని, గోరా బోధించే నాస్తిక వాదాన్ని అమితంగా ఇష్టపడిన ఆయన ఆ ముగ్గురి పేర్లలోని మొదటి అక్షరాలతో తన పేరును 'గామాగో'గా మార్చుకున్నారు. వారి సిద్ధాంతాలను ఆయన ఇష్టపడటమే కాదు, జీవిత చరమాంకం వరకు ఆచరించి చూపాడు. పేద ప్రజల పట్ల అతనికి ఉన్న ఆకాంక్ష వెలకట్టలేనిది. విద్యా వికాసం ద్వారానే ప్రజా చైతన్యం సాధ్యమని నమ్మి, నిరక్షరాస్యులైన బడుగు, బలహీన వర్గాలకు రాత్రిపూట వయోజన విద్యా పాఠశాలను ప్రారంభించి చదువు చెప్పేవారు. జాతీయోద్యమం గురించి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల గురించి, పరాయి పాలకుల దోపిడీ గురించి వివరిస్తూ ప్రజల్లో దేశ భక్తి బీజాలు నాటారు. 1942లో 'క్విట్ ఇండియా' ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడింది. గామాగో చురుకుగా ఈ ఉద్యమంలో పాల్గొంటూ ఇతర విద్యార్థులను కూడగట్టుకొని సమ్మెలు, హర్తాళ్లు, కళాశాలల బహిష్కరణలు, రైలు రోకోలు లాంటి కార్యక్రమాలు విజయవంతంగా నడిపారు. తన ఉపన్యాసాలతో విద్యార్థులను, ప్రజలను ఉత్సాహ పరుస్తూ క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. దీంతో బ్రిటీషు ప్రభుత్వం ఈయన కార్యకలాపాలపై కన్నెర్ర జేసింది. 1943 ఫిబ్రవరి 22న ఒక సభలో ఉపన్యాసం చేస్తుండగా పోలీసులు చుట్టుముట్టి విపరీతంగా కొట్టి ఆసుపత్రిలో చేర్పించారు. తర్వాత ఆరు నెలలు అలీపురం జైలులో కారాగార శిక్ష విధించారు. ఆ తర్వాత బయటకు వచ్చిన గామాగో ఆంగ్లేయ కళాశాల్లో బానిసగా చదువుకోవడానికి ఇష్టపడలేదు. తనకు చదువు కన్నా, దేశభక్తి ముఖ్యమని భావించి, కళాశాల విద్యను వదిలేసి మహాత్ముని నాయకత్వంలో ఉధృతంగా జాతీయోద్యమంలో పాల్గొన్నారు.

తుదిశ్వాస వరకు సాధారణ జీవితం గడిపిన గామాగో ఆత్మకథగా రాసుకున్న పుస్తకం తిరిగి ముద్రించి ప్రపంచానికి అందించే అవకాశం నాకు లభించడం చాలా సంతోషదాయకం. ఆయన ఇష్టమైన మార్క్స్‌పై 'మార్క్స్ జీవితం - సిద్ధాంతాలు' అనే మరో గ్రంథం తెనిగిస్తున్న సమయంలో ఆయన గుండె పోటుతో మృతి చెందారు. నాడు సర్వం త్యాగం చేసి పేద ప్రజల పక్షాన నిలిచిన గామాగో నేటి తరానికి నిజంగానే విస్మృత కార్యకర్తే.



- డాక్టర్ ఎం.హరికిషన్,
పుస్తక పునర్ముద్రణ కర్త,
సమీక్షకుడు, కర్నూలు

రంగస్థల నటనలో గిరిశిఖరం..!

- ఐదు దశాబ్దాలుగా రాణింపు
- పద్యాలాపనతోనే దినచర్య ప్రారంభం
- 74 ఏళ్ల ప్రాయంలోనూ కళల్లో రాణిస్తున్న దస్తగిరి




శ్రీకృష్ణ పాత్రధారణలో..,

కంచుతో సమానంగా మోగే కంఠం... హార్మోనియం పెట్టెనే రాగాలతో పరుగులు తీయించే గాత్రం.. గంభీరమైన వాచకాభినయం ఆయన సొంతం. నాలుగున్నర శ్రుతిలో రాగాలాపన అలవోలకగా పాడగల కళాకారుడు. ఒకటి కాదు, రెండు కాదు, తన 74 ఏళ్ల ప్రాయంలోనూ అదే స్ఫూర్తిని కొనసాగిస్తున్నారు. పౌరాణిక పద్య నాటక రంగంలో అప్రతిహత ప్రస్థానంతో జైత్రయాత్ర చేస్తూనే ఉన్నారు. ఐదు దశాబ్దాలుగా కర్నూలు కళామతల్లి కీర్తి కిరీటంలో కలికితురాయిగా నిలిచిపోయారు. ఆయనే కర్నూలుకు చెందిన సీనియర్ రంగస్థల కళాకారుడు, లలితకళా సమితి పూర్వ అధ్యక్షుడు పి.దస్తగిరి. రంగస్థలంపై నటుడిగా శ్రీకృష్ణ, శ్రీరామ, అర్జున, సత్యహరిశ్చంద్ర వంటి పౌరాణిక నాటకాలతోపాటూ చింతామణిలో భవానీ వంటి పాత్రలు ధరించి తనదైన వాణి, బాణితో ముందుకు సాగుతున్నారు. ఇతరులు అనుసరించలేని గాత్రపాండిత్యంతో ఆయన... తనకు తానే పోటీగా నిలుస్తున్నారు. మరోవైపు రేడియో గాయకునిగానూ బీ-హై గ్రేడ్ ఆర్టిస్టు గుర్తింపు పొంది కర్నూలు, కడప, విజయవాడ, హైదరాబాదు ఆకాశవాణి కేంద్రాల్లోనూ తరచూ శ్రోతలను అలరిస్తున్నారు. వృత్తిరీత్యా జూనియర్ కళాశాల అధ్యాపకునిగా పదవీ విరమణ చేసినా, ప్రవృత్తి రీత్యా రంగస్థల నటుడిగా ఔత్సాహిక కళాకాలరులకు మార్గదర్శకంగా నిలుస్తున్నారు.

-కర్నూలు కల్చరల్, మే 10 (ఆంధ్రజ్యోతి)

బాల్యం...చదువు, ఉద్యోగ జీవితం

నందవరం మండలం మాచాపురం గ్రామానికి చెందిన పి.హుస్సేన్ బీ, ఖాసీం దంపతులకు 1952 జూలై 1న జన్మించిన దస్తగిరిది వ్యవసాయ కుటుంబం. 1969లో ఎస్ఎస్ఎల్‌సీ పూర్తి చేసి, 1970లో పీయూసీ కర్నూలు ఉస్మానియా కళాశాల్లో చేరారు. అక్కడే బీఏ 1974లో పూర్తి చేశారు. అనంతరం తిరుపతి ఎస్వీ యూనివర్శిటీలో ఎంఏ 1976లో పూర్తిచేసి 1978 వరకు ఎంజీ బ్రదర్స్ సంస్థలో ట్రైనీ మేనేజర్‌గా పని చేశారు. తర్వాత 1980లో కర్నూలు సెయింట్ మేరీస్ జూనియర్ కళాశాల్లో ఎంఏ (పొలిటిక్స్) తాత్కాలిక అధ్యాపకునిగా చేరి, 1984లో ఏపీపీఎస్‌సీ అధ్యాపక పరీక్షలు రాసి, అదే కళాశాల్లో ప్రభుత్వ అధ్యాపకునిగా నియమితులయ్యారు. 2010లో అదే కళాశాల్లో పదవీ విరమణ చేశారు.


శ్రీకృష్ణ విజయం నాటకంలో ఒక దృశ్యం

బాల్యం నుంచీ నటనలో ఆసక్తి...

స్వగ్రామంలోని పినతండ్రి ఖాసీం పాడే శ్రీకృష్ణ రాయబారంలోని పద్యాలు వింటూ ఆ పద్యాలపై దస్తగిరి ఆసక్తి పెంచుకున్నారు. హైస్కూలు చదివే రోజుల్లో 1969లో శ్రీకృష్ణ వేషంలో ద్వారకా ఘట్టాన్ని ప్రదర్శించారు. నాటి పాఠశాల హెచ్ఎం శామ్యూల్ జార్జ్ (మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ తండ్రి) దస్తగిరిని నాటక రంగంలో వెన్నుదట్టారు. స్కూల్ లీవింగ్ సర్టిఫికెట్‌లో 'ప్రత్యేక ప్రతిభ కలిగిన విద్యార్థి' అని రాశారు. అలాగే నాటి హార్మోనిస్టు గిరిస్వామి పద్యాలాపన, రాగాలు, శృతి స్థాయిలను దగ్గర ఉండి నేర్పించారు. నాటక రంగంలో శ్రీకృష్ణ పాత్రతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దస్తగిరి శ్రీకృష్ణాభిమన్యు, రామాంజనేయ యుద్ధం, శ్రీకృష్ణాంజనేయ యుద్ధం, భక్త మాదవదాసు, సత్య హరిశ్చంద్ర పాత్రల్లో ప్రేక్షకులను మెప్పించారు. సుమారు రెండు వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. కర్నూలులో సహచర కళాకారులు డి.రంగముని, తిమ్మయ్య వంటి హార్మోనిస్టులతో కలిసి నాటక ప్రదర్శనలు చేస్తూనే నాటి లలిత కళా సమితి (నేటి టీజీవీ కళాక్షేత్రం)కు మూడో అధ్యక్షునిగా ఎంపికై 1998 నుంచి 2002 వరకు సేవలు అందించారు. 1985 నుంచి ఆకాశవాణి కడప రేడియోలో ఆర్టిస్టుగా గుర్తింపు తెచ్చుకొని అనేక పద్యాలు, నాటకాలు ప్రదర్శించారు. 1991లో కర్నూలు ఆకాశవాణి కేంద్రం ఏర్పడ్డాక ఇక్కడ కూడా ప్రదర్శనలు ఇస్తూ ప్రస్తుతం ఆకాశవాణి బీ-హై గ్రేడ్ ఆర్టిస్టుగా రాణిస్తున్నారు. కళల్లో రాణిస్తూ అభినవ ఏవీ సుబ్బారావు అనే బిరుదును సాధించారు. 1983లో నాటి ప్రఖ్యాత నటుడు షణ్ముఖి ఆంజనేయరాజు వంటి నటులతో నటించి ప్రశంసలు అందుకున్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని ఆంధ్రభవన్‌లో 2004లో ద్వారక ఘట్టం ప్రదర్శించారు. 1999లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా నంది అవార్డు అందుకున్నారు.


శ్రీకృష్ణ తులాభారంలో ఒక దృశ్యం


నాటి ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి చేతుల మీదుగా సత్కారం అందుకుంటూ...


శ్రీకృష్ణ రాయబారం ద్వారకా ఘట్టంలో..

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం

పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి బీసీ దంపతులు


స్వామివారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న మంత్రి బీసీ దంపతులు

బనగానపల్లె, మే 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోట వీధిలో వెలసిన భూలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా శనివారం నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అర్చకులు ఉత్సవమూర్తులను కల్యాణ మండపం వద్దకు చేర్చి పట్టు వస్త్రాలు పూలమాలలతో అలంకరించారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులు ఆలయానికి చేరుకొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకొని మంత్రి దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కల్యాణం తిలకించారు. రాత్రి ఉత్సవమూర్తులను హనమంత్ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉగ్రసేనారెడ్డి, నాయకులు వెంకటరమణ నాయక్, పక్కిన మద్దిలేటి గౌడ్, అరుణ్‌కుమార్‌నాయక్, దంతెల రమణ, తిక్కన్న, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


చెన్న కేశవస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అమ్మ అనురాగం..

నంద్యాల కల్చరల్, మే 10(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్.. అమ్మ ప్రేమ అనురాగం గురించి అరవై సూక్ష్మచిత్రాలను వాటర్ కలర్స్‌తో మైక్రోబ్రష్ ద్వారా రెండు గంటల సమయంలో చిత్రీకరించారు. ప్రపంచ మాతృ దినోత్సవం పురస్కరించుకొని చిత్రకారుడు కోటేష్ అమ్మ అనురాగం చిత్రంలో బిడ్డలపై తల్లి మమకారం ఎలాఉంటుందో చూపించారు. ఈచిత్రంలో మనుషులతో పాటు, జింకలు, ఆవులు, గేదెలు, ఏనుగు, జిరాఫీ, కుక్కలు, నక్కలు, కుందేళ్లు, బాతులు, కొంగలు, కాకులు, పావురాలు ఇలా ఎన్నో వాటి పిల్లలతో ప్రేమతో ఉన్నట్లు వేశారు. ఈచిత్రాన్ని కోటేష్ తన మాతృమూర్తికి అంకితం చేశానన్నారు. మాతృదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.


అమ్మ అనురాగం గురించి చిత్రంలో చూపించిన చిత్రకారుడు కోటేష్


చిత్రకారుడు కోటేష్

కమనీయం.. నృసింహస్వామి రథోత్సవం

- గోవింద నామస్మరణతో మార్మోగిన మాడ వీధులు
- స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు


అశేష భక్తుల మధ్య స్వామి రథోత్సవం

ఆళ్లగడ్డ, మే 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలంలో నృసింహస్వామి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. వేదపండితులు కిడాంబి వేణుగోపాలన్‌స్వామి, మణియర్ సౌమ్యనారాయణన్ జ్వాలా నరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై అలంకరించి ప్రత్యేక పూజలు చేశా రు. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున గోవింద నామస్మరణలు చేస్తూ తరించారు. ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత జ్వాలా నరసింహస్వామిని అందంగా అలంకరించి పల్లకిలో కొలువు దీర్చి మాడ వీధులలో ఊరేగించారు. సాయంత్రం స్వామి పుష్ప పల్లకోత్సవాన్ని నిర్వహించారు. ఈ పూజాలకు అహోబిలంకు చెందిన లక్ష్మమ్మ, శేషాచార్యులు, గిద్దలూరుకు చెందిన సతీష్, హైదరాబాద్‌కు చెందిన విజయకుమార్ ఉభయదారులుగా వ్యవహరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.


సైనికుల సేవలు ఎనలేనివి

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- టీజీవీ కళాక్షేత్రంలో 'జై జవాన్' కల్చరల్ ఫెస్ట్ ప్రారంభం


ప్రసంగిస్తున్న టీజీ వెంకటేశ్




దేశభక్తి గీతాలకు జానపద కళాకారుల నృత్యాలు



కర్నూలు కల్చరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలర్పిస్తున్న సైనికుల సేవలు ఎనలేనివని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో వారం రోజుల పాటు ఏర్పాటు చేసిన 'జై జవాన్' కల్చరల్ ఫెస్టివల్‌ను ఆయన శనివారం ఘనంగా ప్రారంభించారు. తొలుత భరతమాత చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ తన పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా 'జై జవాన్ ఫెస్టివల్' నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఏటా మే16వ తేదీన కులమతాలకు అతీతంగా సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇంకా ఎవరైనా జంటలు పేర్లు నమోదు చేసుకోవాలనుకుంటే ఆది వారంలోగా సంప్రదించాలన్నారు. మనం ఎంత సేవ చేసినా సముద్రంలో నీటిబొట్టులాంటిదేనని, కానీ దేశానికి సేవలు అందించే సైనికుల సేవలు వెలకట్టలేనివని అన్నారు. ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకే భారత ప్రధాని మోదీ యుద్ధానికి సిద్ధపడ్డారన్నారు. ఇప్పటికే టెర్రరిస్టు స్థావరాలను నాశనం చేశారని, ప్రతిదాడులని తిప్పి కొట్టారని చెప్పారు. ఈ సందర్భంగా దేశ భక్తిపై రూపొందించిన సాంస్కృతిక అంశాలను ప్రదర్శించిన కళాకారులను ఆయన శాలువలతో ఘనంగా సత్కరించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కళాక్షేత్రంలో వారం రోజుల పాటూ దేశభక్తిని చాటిచెప్పేలా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతిరోజూ ఒక గంట ప్రదర్శిస్తారమని, దేశ సైనికులకు సంఘీభావం తెలుపుతూ టీజీవీ కళాక్షేత్రం పక్షాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారులు మహ్మద్ మియా, యాగంటీశ్వరప్ప, శ్రీనివాసరెడ్డి, సీవీ రెడ్డి, వీవీ రమణారెడ్డి, పి.రాజారత్నం, వాల్మీకి రాముడు తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తిపై ప్రదర్శనలు : ఒకవైపు ఉప్పొంగే దేశభక్తిని, మరోవైపు దేశం సరిహద్దులో యుద్ధం చేస్తూ దేశానికి రక్షణగా నిలుస్తున్న సైనికుల వీరోచిత పోరాటాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తూ కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అసాంతం అలరింపజేశాయి. కళాకారులు శ్రీనివాసరెడ్డి, సంగా ఆంజనేయులు, నృత్యకళాకారులు కరీముల్లా, సుమాంజలి, కార్తీక, సుదేష్ణ, సత్య, తేజస్విని, తన్విశ్రీ, కేదారి, గాయకులు సుజాత, మహ్మద్ మియా, ఘంటసాల శ్రీనివాస్, ఖాజావలి, కె. బాలవెంకటేశ్వర్లు, జానపద నృత్యకారులు సమీర, అఖిల, హరిబాబు, సుబ్బరాయుడు, నారాయణ తదితరులు అలరించారు.

నేడు రామాంజనేయ యుద్ధం నాటకం : జై జవాన్ కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా ఆదివారం సాయంత్రం దేశభక్తిని ప్రబోధించే జానపద, సినీ సంగీత విభావరి, అనంతరం రామాంజనేయ యుద్ధం నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు.


సైనికుడిగా కళాకారుడు శ్రీనివాసరెడ్డి

నైరాశ్యంలో కార్యదర్శులు

- జాబితా సిద్ధంచేసి ఏడు మాసాలు
- నేటికీ అందని పదోన్నతులు
- సీనియార్టీలో వెనుకబడుతామని ఆవేదన
- కొన్ని జిల్లాలో పూర్తయిన ప్రక్రియ



జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం

కర్నూలు కలెక్టరేట్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా పదోన్నతులు లేక పంచాయతీ కార్యదర్శులు నైరాశ్యంలో కూరుకుపోయారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్నినెలలకే తీపి కబురు అందించింది. పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రక్షాళన చేస్తూనే అందులో పనిచేస్తున్న సిబ్బందికి పదోన్నతులు కల్పించాలని నిర్ణయం తీసుకుంది. ఈ శాఖలో ఉన్న ఖాళీలను గుర్తించి గతేడాది నవంబరు 30న పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించింది. కిందిస్థాయిలో సీనియారిటీ జాబితాల రూపకల్పనలో ఎడతెగని జాప్యం కారణంగా ఏడు మాసాలు గడిచిపోయాయి. గ్రేడ్-1, గ్రేడ్-2 పదోన్నతులను పంచాయతీరాజ్ శాఖ కమిషనరేట్ స్థాయిలో నిర్ధారిస్తారు. గ్రేడ్-3, 4, 5, 6 వరకు పదోన్నతులను జిల్లా గ్రామ పంచాయతీ అధికారి వారి కార్యాలయం నిర్ధారణ చేయాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గ్రేడ్-1 ఖాళీలు-3, గ్రేడ్-2 ఖాళీలు 18 ఉన్నాయి. అదే విధంగా గ్రేడ్-3 ఖాళీలు 16, గ్రేడ్-4 ఖాళీలు 118, గ్రేడ్-5 ఖాళీలు 29 ఉన్నాయి. ఇవి కాకుండా పైనుంచి మరికొన్ని ఖాళీలు ఏర్పడే అవకాశం ఉన్నందువల్ల తాము నిరీక్షిస్తున్నట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈవిషయమై గత నెలలో పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ ఒక స్పష్టతను ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న ఖాళీలతో పదోన్నతులు భర్తీచేయాలని ఆదేశాలిచ్చారు. ఇందుకోసం తక్షణమే దస్త్రం రూపొందించి పదోన్నతులు ఇవ్వాలన్నారు. పైనుంచి తర్వాత వచ్చే ఖాళీలను మరో దస్త్రం ద్వారా రూపకల్పన చేసి పదోన్నతులు ఇవ్వవచ్చని ఆదేశాలు జారీచేశారు. ఈప్రక్రియ అంతా ఏప్రిల్ 30 లోగా పూర్తికావాలని ఆయన నిర్దేశిత గడువును కూడా విధించారు.

ఈవోపీఆర్డీ పేరును డిప్యూటీ ఎంపీడీవోగా..

గతంలో విస్తరణాధికారిగా (ఈవోపీఆర్డీ) ఉన్న పేరును జీవో.నెం.35 ప్రకారం డిప్యూటీ ఎంపీడీవోగా మార్చారు. గత నెలాఖరులో డిప్యూటీ ఎంపీడీవోలుగా ఉన్న వారికి ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పించారు. ఇక గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న వారికి డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పించే దస్త్రం కమిషనరేట్ పరిధిలో తుది దశలో ఉంది. ఈనేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ఖాళీలతో ఉమ్మడి జిల్లాలో పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయవచ్చు. ఇప్పటికే తూర్పు గోదావరి, కృష్ణ, చిత్తూరు, శ్రీకాకుళం వంటి జిల్లాలో పదోన్నతులిచ్చి రెండు నెలలు పూర్తయ్యాయి. భవిష్యత్తులో ఉమ్మడి కర్నూలు జిల్లా పంచాయతీ కార్యదర్శులు జోనల్ విధానంలో సీనియారిటీ జాబితాలో వెనుకబడిపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో పూర్తి చేస్తాం



గ్రేడ్-1, గ్రేడ్-2 పదోన్నతులు ప్రక్రియ త్వరలో పూర్తి కానున్నాయి. జిల్లాలో గ్రేడ్-2 పదోన్నతులు 65 మందికి లభించాయి. గ్రేడ్-3 నుంచి గ్రేడ్-6 వరకు పదోన్నతులు 15 రోజుల్లో పూర్తిచేస్తాం.
- భాస్కర్, డీపీవో, కర్నూలు

మిస్టరీ వీడేనా..?



వివరాలు నమోదు చేస్తున్న పోలీసులు, రెవెన్యూ సిబ్బంది

(5వ పేజీ తరువాయి)

ఆ తర్వాత కర్నూలు ప్రభుత్వ ఫోరెన్సిక్ వైద్యులకు తగిన ఫొటోలను పంపించారు. వాటిని స్వాధీనంచేసుకుని ల్యాబ్‌కు పంపించారు.

ఎట్టకేలకు కేసు నమోదు

గుర్తుతెలియని వ్యక్తి మృతి ఘటనపై గడివేముల పోలీసులు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. నిజానికి పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లిన రోజే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి ఉంటే పరిస్థితి ఇంతదాకా వచ్చేది కాదని పోలీసు వర్గాల్లో చర్చ సాగుతోంది. ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక ఆధారంగా లభించిన ఆనవాళ్లు మనషులవే అని తేలితే విచారణను వేగవంతం చేసే అవకాశం ఉంది. మిస్సింగ్ కేసుల ఆధారంగా విచారణ చేసి లభించిన ఆనవాళ్లతో వారి రక్తసంబంధీకులకు డీఎన్ఏ పరీక్ష చేస్తే కేసు కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా లభించిన ఆనవాళ్లపై పలు ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈఆనవాళ్లు పోలీసులు కూడా గుర్తించలేని స్థితిలో ఉండటం గమనార్హం. పైగా కాలిపోయి ఉండటం మరింత విస్మయం కలిగిస్తోంది. ఈ ఎముకలు మనుషులవా లేక జంతువులవా? అనే సందేహాలు కలుగుతున్నాయి.

గడివేములలో కలకలం

గుర్తు తెలియని శవానికి సంబంధించి ఆనవాళ్లను నామరూపం లేకుండా చేసిన ఈ ఘటన రెండురోజులుగా గడివేముల మండల వ్యాప్తంగా కలకలం రేపింది. తాజాగా శనివారం పోలీసులు బృందాలుగా ఏర్పడి ఘటన స్థలంతో పాటు మండలం కేంద్రంలో విచారణ చేయడంతో మరింత చర్చనీయాంశంగా మారింది. ఈ శవం ఎవరిదన్న విషయం పక్కనపెడితే.. పోలీసులు వ్యవహరించిన తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతులు, స్థానికుల తెలుపుతున్న సమాచారం మేరకు లభ్యమైన ఎముకలు అస్థిపంజరానికి సంబంధించినవేనని స్పష్టమవుతోంది. ఏదిఏమైనా ఫోరెన్సిక్ ల్యాబ్ ఇచ్చే నివేదికపైనే కేసు మిస్టరీ ఆధారపడి ఉంది.

పసుపు కొమ్ములు దగ్ధం



అల్లినగరంలో కాలిబూడిదైన పసుపు కొమ్ములు

మహానంది, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లినగరం సమీపంలో విత్తనం కోసం రైతులు తెచ్చుకొన్న పసుపు శనివారం అగ్ని ప్రమాదంలో కాలి బూడిదయ్యింది. దీంతో మండలంలోని బుక్కాపురం గ్రామానికి చెందిన రైతులు ఈశ్వరయ్య, సూరి, రవి, ప్రసాద్ ఇటీవల వైఎస్సార్ జిల్లా మైదుకూరు మండలం కేసి లింగయాపల్లె నుంచి విత్తనం పసుపును కొనుగోలు చేసి అల్లీనగరం సమీపంలో భద్రపరుచుకున్నారు. అయితే శనివారం అగ్ని ప్రమాదం జరగడంతో పసుపు కాలిపోయింది. గమనించిన స్థానికులు నంద్యాల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వెంటనే రంగంలోకి దిగిన సిబ్బంది ఘటనా స్థలంలో మంటలను ఆర్పివేసారు. అప్పటికీ పసుపు పూర్తిగా కాలిపోయి బూడిదయ్యింది. రూ.4 లక్షలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

అన్న మరణం తట్టుకోలేక..

- రైలు కిందపడి తమ్ముడి బలవన్మరణం
- శోకసంద్రంలో కుటుంబం



మృతదేహాన్నిపరిశీలిస్తున్న పోలీసులు

కర్నూలు క్రైం, మే 10 (ఆంధ్రజ్యోతి) : సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అన్న కొన్ని రోజుల క్రితం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోగా దీని జీర్ణించుకోలేక శనివారం తమ్ముడు రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో నగరంలోని అబ్బాస్‌నగర్ రైల్వే ట్రాక్ సమీపంలో చోటుచేసుకున్నట్లు రైల్వేపోలీసులు తెలిపారు. వివరాలు.. రామచంద్రనగర్‌కు చెందిన ఈడిగ శ్రీనివాసులు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు సంతానం. పెద్దకొడుకు రాజేష్‌గౌడుకు ఇటీవలే పెళ్లి చేశారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తూ పెళ్లయిన 20 రోజులకు అక్కడే ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటినుంచి చిన్న కొడుకు వంశీకృష్ణ(29) అన్న మరణాన్ని జీర్ణించుకోలేక బాధపడతూ ఉండేవాడు. ఈవిషయంపై తల్లిదండ్రులు అతడిని సైక్రియాటిస్టు వద్ద చూపించారు. ఈనెల 7వ తేదీన తల్లిదండ్రులు బంధువుల పెళ్లికి వెళ్లారు. 9వ తేదీ ఉదయం ఇంటి వచ్చేసరికి వంశీకృష్ణ కనిపించలేదు. సెల్‌ఫోన్ కూడా స్విచ్ఛాప్ కావడంతో అన్ని చోట్ల వెతికారు. శనివారం ఉదయం అబ్బాస్‌నగర్ సమీపంలో ఖానా ఖజానా రైల్వేట్రాక్ పక్కన వంశీకృష్ణ శవమై కనిపించాడు. తన చావుకు ఎవరూ కారణం కాదని, అమ్మా, నాన్న సారీ అంటూ సూసైడ్ నోట్ రాసుకున్నాడు. నోట్‌లో తండ్రి ఫోన్ నెంబరు ఉండటంతో ఆనెంబరకు ఫోన్‌చేసి తండ్రికి సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడు వంశీకృష్ణ ఎంఎస్సీ చదివి ప్రస్తుతం కర్నూలు ఇంటి వద్దనే ఉంటున్నాడు. కేసు నమోదు చేసినట్లు రైల్వే సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

గడివేముల, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌కే తండా గ్రామ శివారులో విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందారు. ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాలివీ.. ఎల్‌కే తండా గ్రామానికి చెందిన వెంకట్‌నాయక్ మేకల మేత కోసం చెట్టుపైకి ఎక్కి కొమ్మలు కోస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో వెంకట్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందారు. వెంకట్‌నాయక్‌కు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె సంతానం. ఆయన భార్య పార్వతీబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నందికొట్కూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని ఎన్టీఆర్ జలాశయంలో ఓ గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. వివరాలివీ.. శనివారం ఉదయం స్థానికులు ఎన్టీఆర్ జలాశయం నీటిలో మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయసు దాదాపు 70ఏళ్లు ఉంటుందని చెప్పారు. మృతదేహాన్ని నందికొట్కూరు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతికి గత కారణాలను తెలుసుకుంటామని తెలిపారు. ఎవరైనా ఇంట్లో తప్పిపోయి ఉన్న వారి కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ సభ్యుడిగా విశ్వనాథరెడ్డి



నంద్యాల రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ సభ్యుడిగా నంద్యాలకు చెందిన నరహరి విశ్వనాథరెడ్డి నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీచేసినట్లు నరహరి విశ్వనాథరెడ్డి శనివారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి చొరవతో ఈ పదవి దక్కిందన్నారు. ఎంపీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అదనపు హెచ్ఆర్ఏ తొలగింపు అన్యాయం

- ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బాలునాయక్



సంఘీభావం తెలుపుతున్న నాయకులు

కర్నూలు హాస్పిటల్, మే 10 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పనిచేస్తున్న ఎంఎన్‌వోలకు అదనపు హెచ్ఆర్ఏను ట్రెజరీ అధికారులు తొలగించడం అన్యాయమని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బాలునాయక్ అన్నారు. శనివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల యూనియన్ ఆఫీసులో ఎంఎన్‌వోల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంతో చర్చించి యూనియన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు రామచందర్ అదనపు హెచ్ఆర్ఏ కోసం ప్రభుత్వంతో చర్చించి 1983లో జీవో తెప్పించారన్నారు. కర్నూలు జీజీహెచ్‌లో ట్రెజరీ అధికారులు ఈనెల నుంచి ఎంఎన్‌వోలకు అదనపు హెచ్ఆర్ఏను తొలగించారన్నారు. దాదాపు 60 మంది ఎంఎన్‌వోలు ఉన్నారని, రాత్రి పగలు కష్టపడి విధులు నిర్వహించేవారు నష్టపోతారని అన్నారు. అదనపు హెచ్ఆర్ఏ తొలగించడం పై సోమవారం నుంచి ఆందోళన చేపడుతామన్నారు. యూనియన్ కోశాధికారి సురేష్, సర్జెంట్ ఉరుకుందయ్య, చిన్నయ్య, దాస్, వెంకటేశ్వర్లు, నవీన్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



కర్నూలు ఎడ్యుకేషన్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9నుంచి 12 గంటల వరకు మొదటి సంవత్సరం పరీక్షలు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయి. కర్నూలు జిల్లాలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 21,324 మంది హాజరువుతున్నారు. మొత్తం 52 పరీక్షా కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. జిల్లా పరీక్షల విభాగం కన్వీనర్, ఆర్ఐవో గురువయ్యశెట్టి, డీవీఈవో సురేష్‌బాబు డీఈసీ కమిటీ సభ్యులు జి.లాలెప్ప, సురేష్ చంద్ర, పద్మావతితో పాటు, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తారు. జిల్లాలో ఏడు సమస్యాత్మక కేంద్రాలను గుర్తించారు. కృష్ణగిరి ఏపీ మోడల్ స్కూల్, ఆలూరు, పత్తికొండ, దేవనకొండ, కోసిగి, చిప్పగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని పరీక్షా కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి మాల్ ప్రాక్టీసు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతించేది లేదని ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి వెల్లడించారు. పరీక్షా కేంద్రాల్లోకి చీఫ్ సూపరింటెండెంట్లు మినహా ఎవరూ సెల్‌ఫోన్లు తీసుకెళ్లకూడదని హెచ్చరించారు.

కర్నూలు జిల్లాలో 25వేల మట్టి పరీక్షలు

కర్నూలు అగ్రికల్చర్, మే 10 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఖరీఫ్‌కు రైతుల పొలాల్లో సారాన్ని బట్టి అవసరమైన మోతాదులో వివిధ రకాల ఎరువులను వినియోగించేందుకు భూసార మట్టి పరీక్షలు నిర్వహించేందుకు కార్యచరణ ప్రణాళికను సిద్ధంచేశారు. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని భూసార పరీక్షలో 12,931 మట్టి పరీక్షలు, ఎమ్మిగనూరు భూసార పరీక్ష కేంద్రంలో 13,011 మట్టి పరీక్షలు నిర్వహించనున్నారు.

కర్నూలు మార్కెట్ యార్డులోని పరీక్షా కేంద్రంలో 13 మండలాలకు చెందిన మట్టి నమూనాలను పరిశీలించనున్నారు. మిగిలిన 13 మండలాల పరిధిలోని పొలాలకు చెందిన మట్టి పరీక్షలను ఎమ్మిగనూరులో పరీక్షించనున్నారు. ఈ మట్టి నమూనాల పరీక్షల అనంతరం ఏ ఎరువు ఎంత శాతం లోపం ఉందో... ఏ ఎరువు అధిక మొత్తంలో నిక్షిప్తమై ఉందో తెలుసుకుని ఆ మేరకు ఎరువులను వినియోగించేందుకు రైతులకు సూచనలు చేస్తారు. మట్టి పరీక్షల కోసం జిల్లా వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి ఇటీవల రైతుల పొలాల్లో మట్టి నమూనాలు ఏవిధంగా సేకరించాలనే విషయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి రైతు సలహా కేంద్రం నుంచి 55 మట్టి నమూనాలు సేకరించే విదంగా లక్ష్యాన్ని కేటాయించారు. రైతులు పొలాల్లో విత్తనాలు వేసే సమయానికల్లా ఈ మట్టి పరీక్షలు రైతులకు అందుబాటులోకి ప్రత్యేక కార్డుల ద్వారా అందిస్తామని జేడీ వరలక్ష్మి తెలిపారు.

91 కేసులు నమోదు

నంద్యాల టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): గడి చిన 24 గంటల్లో 91 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్ , అనుమానితులను, వారి వేలిముద్రలను పరిశీలించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం మద్యం, ఇసుక, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు అక్రమ రవాణ నియంత్రించడానికి, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఈ తనిఖీలు చేసినట్లు తెలిపారు.

గృహాలను పూర్తిచేయండి

వెల్దుర్తి, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో నిలిచిపోయిన గృహ నిర్మాణాలను జూన్ 12లోపు పూర్తిచేయాలని హౌసింగ్ పీడీ చిరంజీవి అధికారులను ఆదేశించారు. శనివారం వెల్దుర్తి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో గృహ నిర్మాణల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ, ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు అదనపు ఆర్థిక సాయం ప్రకటించిందన్నారు. ఈ పథకం కింద మండలంలో 97 మంది లబ్ధిదారులు అర్హత పొందారని, వారి గృహాలను జూన్ 12లోపు చేయాలన్నారు. ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ ప్రభాకర్, డీఈ విజయ్ కుమార్, హౌసింగ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ చిరంజీవి

అపూర్వ సమ్మేళనం



ఉపాధ్యాయులతో జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు



బేతంచెర్ల శేషారెడ్డి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కొలిమిగుండ్ల, మే 10 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్లలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో 2002-2003లో పదో తరగతి విద్యనభ్యసించిన విద్యార్థులు శనివారం కలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. తమకు విద్యను బోధించిన గురువులు వైవీఎస్ నారాయణరెడ్డి, బాలసుబ్బారెడ్డి, విజయప్రసన్న, రాఘవేంద్ర ప్రసాద్, శేషమరాజు, రమణారెడ్డి తదితరులను ఘనంగా సన్మానించారు. పూర్వపు విద్యార్థులంతా కలిసి తమ మిత్రులకు ఆర్థికసాయం చేశారు. పాఠశాల అభివృద్ధి కోసం విరాళం అందజేశారు.

శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో..

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో శనివారం 1990-91లో పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన నిర్వహించారు. దాదాపు 34 ఏళ్ల తర్వాత కుటుంబ సమేతంగా కలు సుకున్నారు. అనంతరం గురువులు రామశర్మ, ఆదినారాయణ, హనీఫ్, నాగభూషణం, తిరుపాలయ్యను పూర్వ విద్యార్థులు సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎంపీపీ బుగ్గ న నాగభూషణం రెడ్డి, బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, నరసింహనాయుడు, విజయుడు, బాషా, నడిపి హుశేన్, చంద్ర, పూర్వ విద్యార్థినులు అమరావతి, చంద్రకళ, ధనలక్ష్మి, భారతి, నాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

50 శాతం సబ్సిడీపై దాణా పంపిణీ

● జేడీ శ్రీనివాస్

కర్నూలు అగ్రికల్చర్, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై దాణా పంపిణీకి చర్యలు చేపట్టిందని పశుసంవర్ధక శాఖ జేడీ శ్రీనివాస్ తెలిపారు. కర్నూలు జిల్లాకు 250 టన్నులు, నంద్యాల జిల్లాకు 250 టన్నుల ప్రకారం దాణాను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కేటాయించందని తెలిపారు. 50కిలోల దాణా బస్తా ధర రూ.1,110కాగా, ఇందులో రైతులు రూ.555 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని, మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తుందని వివరించారు. పాడి పశువులు కలిగిన రైతులు వారి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో నాన్ సబ్సిడీని చెల్లించి దాణాను పొందవచ్చని, ఒక రైతుకు 50 నుంచి 100 కిలోలు దాణాను పంపిణీ చేస్తామని తెలిపారు.

నాగేశ్వరరావుయాదవ్‌కు సన్మానం


వై. నాగేశ్వరరావుయాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి): జిల్లా కోఆపరేటివ్ మార్కెట్ సొసైటీ ఛైర్మన్‌గా వై. నాగేశ్వరరావు యాదవ్ ఎన్నిక కావడంతో టీడీపీ నాయకులు శనివారం సన్మానించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మాట్లాడుతూ టీడీపీ బీసీల పార్టీ అని మరోసారి రుజువు చేసుకుందని టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి అన్నారు. జిల్లా తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సీడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డిలతో కలిసి నాయకులు వై. నాగేశ్వరావును శాలువతో సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్‌ల డైరెక్టర్లు పోతురాజు రవి కుమార్, ధరూర్ జేమ్స్, సత్రం రామకృష్ణుడు, కాకర్ల లక్ష్మీనారాయణ, చంద్రకాంత్, రజక రాంబాబు, పేరపోగు రాజు, రెడ్డి పోగు బజారన్న, శేక్షావళీ తదితరులు పాల్గొన్నారు.

ఉషూ మార్షల్ ఆర్ట్స్ యుద్ధ కళతో సమానం



క్రీడాకారులకు క్రీడాదుస్తులు అందజేస్తున్న డాక్టర్ బి.శంకర్‌శర్మ, కోచ్ టి.శ్రీనివాసులు

కర్నూలు స్పోర్ట్స్, మే 10 (ఆంధ్రజ్యోతి): యుద్ధకళతో సమానమైన ఉషూ మార్షల్ ఆర్ట్స్‌లో సాధన చేస్తే త్రివిధ దళాలకు ఎంపికై దేశ రక్షణలో పాలు పంచుకోవచ్చని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి. శంకర్ శర్మ తెలిపారు. శనివారం స్థానిక పెద్ద మార్కెట్ సమీపంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో శంకర్‌శర్మ మాట్లాడుతూ ఉషూ మార్షల్‌ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. 13, 14 తేదీల్లో నగరంలోని బీ.క్యాంపులో ఉన్న టీజీవీ కళ్యాణ మండపంలో జరిగే జిల్లా, రాష్ట్ర స్థాయి ఉషూ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు తన సొంత ఖర్చులతో క్రీడాదుస్తులు పంపిణీ చేశామన్నారు. డా.శంకర్‌శర్మకు కోచ్ టి.శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు.

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

కర్నూలు న్యూసిటీ, మే 10(ఆంధ్రజ్యోతి): ఆదాయం తెచ్చిపెట్టే స్మార్ట్ మీటర్లను రద్దుచేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జొహరాపురం ఇందిరమ్మ కాలనీ, ఖడక్‌పురా ప్రాంతాలలో సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి స్మార్ట్ మీటర్లు వద్దు అంటూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు షరీఫ్, నాయకులు అబ్దుల్ దేశాయ్, చాంద్‌బాషా, హుస్సేన్, మైమూద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

● మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ

గూడూరు మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ పిలుపునిచ్చారు. శనివారం గూడూరులో కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు సక్రమంగా ప్రజలకు అందించేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో వైసీపీ హయంలో అభివృద్ధి ఏమి జగలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ కర్నూలు పార్లమెంటు తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్, సీనియర్ టీడీపీ నాయకులు రాజారెడ్డి, చెట్టుకింది సురేష్, సంఘాల మధు, అయ్యవారి నాయుడు, చెట్టుకింది నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజలో పాల్గొన్న వాల్మీకులు

గూడూరు మే 10 (ఆంధ్రజ్యోతి): సైనికులకు మద్దతుగా శనివారం గూడూరు పట్టణంలోని వాల్మీకి ఆలయంలో వాల్మీకి ఆలయంలో శ్రీరామచంద్రమూర్తికి ప్రత్యేక పూజలు చేసినట్లు వాల్మీకి సంఘం అధ్యక్షుడు పుట్టపాశం రామాంజనేయులు తెలిపారు. ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసి ధ్వంసం చేయడంపై హర్షం వ్యక్తంచేశారు. ఉగ్రవాదానికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ చేపట్టిన కార్యక్రమానికి ప్రతి భారతీయుడు అండగా నిలవాలని కోరారు.కార్యక్రమంలో గ్రామ వికాస సమితి జిల్లా ప్రముఖ్ దమాం సురేష్, బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ వేల్పుల గోపాల్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్ నాయుడు, సింగనగేరి నాయు డు, బాబు, రాముడు, గిడ్డయ్య, మద్దిలేటి, బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్, వేదవ్యాస్, పొన్నకల్లు వెంకటేష్, పాల్గొన్నారు.

ద్విచక్రవాహన్ని ఢీకొన్న కారు

ఓర్వకల్లు, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్నూలు, చిత్తూరు జాతీయ రహదారి-40పై హుశేనాపురం యూటర్న్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. నంద్యాల జిల్లా గడివేముల మండలం గని గ్రామానికి చెందిన మదన్‌సింగ్, స్వర్ణసింగ్‌లు మద్దిలేటి స్వామి క్షేత్రంలో పూజలు చేసుకుని వెళ్తుండగా.. హుశేనాపురం యూటర్న్ వద్ద ద్విచక్రవాహనం తిరుగుతుండగా.. వెనుక వైపు నుంచి కారు ఢీకొనడంతో మదన్‌సింగ్, స్వర్ణసింగ్‌లకు గాయాలు కాగా, చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


అమర వీరుడు మురళీనాయక్‌కు టీడీపీ నాయకుల నివాళి


వీరజవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్, సమాఖ్య నాయకులు


ఆపుస్మా నాయకుల ఆధ్వర్యంలో...

అమరవీరుడు మురళీ నాయక్‌కు నివాళి

కర్నూలు అర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో జరుగుతున్న 'ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన సత్యసాయి జిల్లా కల్లితండాకు చెందిన జవాన్ మురళీనాయక్ వీరమరణం పొందారని జిల్లా టీడీపీ అధ్యక్షులు తిక్కారెడ్డి అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావు యాదవ్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఆయన మాట్లాడుతూ 2022లో అగ్నివీర్ జవాన్‌గా సైన్యంలో చేరిన మురళీనాయక్ సరిహద్దులో జరిగిన కాల్పుల్లో వీరమరణం పొందారని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థించారు.

● వీర జవాన్ మురళీనాయక్ దేశం కోసం వీరమరణం పొందారని కాంగ్రెస్ పార్టీ కర్నూలు సిటి ప్రెసిడెంట్ షేక్ జిలానీ బాషా అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో యుద్ధంలో అమరుడైన వీర జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ డీసీసీ, ఎం సుధాకర్‌బాబు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు బి. బతుకన్న, జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాలు ఏ. వెంకట సుజాత, ఎన్‌సీ బజారన్న, అనంతరత్నం మాదిగ, షేక్ ఖాజా హుస్సేన్,ప్రతాప్ పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: జమ్మూ కశ్మీర్ దేశ సరిహద్దులో జరిగిన భీకర పోరులో జవాన్ మురళీ నాయక్ వీర మరణం దేశానికే గర్వకారణమని, ఆయన మరణం వృధా కాదని ఆపుస్మా జిల్లా శాఖ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక పాత బస్టాండు తెలుగుతల్లి విగ్రహం నుంచి పాత కంట్రోల్ రూం, చిల్డ్రన్స్ కిడ్స్ వరల్డ్, రాజ్‌విహార్ సర్కిల్, మెడికల్ కళాశాల మీదుగా కలెక్టరేట్ వరకు ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు భారీఎత్తున ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట ఉన్న గాంధీ విగ్రహం ముందు జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి ఆపుస్మా వ్యవస్థాపక అధ్యక్షులు వి.జనార్దన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు వాసు దేవయ్య, మాజీ జిల్లా అధ్యక్షులు పీబీవీ సుబ్బయ్య ఘనంగా నివాళులర్పించారు. గాంధీ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆపుస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రవీంద్ర విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ వంశీధర్, రామకృష్ణ పాఠశాలల కరస్పాండెంట్ చింతలపల్లి రామకృష్ణ, శ్రీలక్ష్మి క్రెడో స్కూల్ కరస్పాండెంట్ కార్తీక్, నాయకులు పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: పాకిస్థాన్‌తో పోరాడుతూ వీరమరణం పొందిన సత్యసాయి జిల్లాకు చెందిన వీర జవాన్ మురళీనాయక్‌కు ఏఐఎస్ఎఫ్,ఏఐవైఎఫ్, ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. శనివారం కలెక్టరేట్ ఎదుట వీరజవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సమాఖ్య నగర అధ్యక్ష, కార్యదర్శులు నాగేంద్రమ్మ, భారతి, నాయకులు మునెమ్మ, శ్రీనివాసులు, సోమన్న, నాగరాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

● వీరజవాన్ మురళీనాయక్ వీరమరణంపై ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఏ.సుభాన్, కమిటీ సభ్యులు పి.ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండి.షరీఫ్ కమిటీ తరఫున నివాళులర్పించారు.

సీహెచ్‌వోలతో ప్రభుత్వం చర్చలు జరపాలి

● ఉద్యోగుల హక్కులను కాలరాసిన గత ప్రభుత్వం
● ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగల్ రెడ్డి
● సమ్మెకు సంఘీభావం తెలిపిన ఏపీ ఎన్జీవో


మాట్లాడుతున్న ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి

కర్నూలు హాస్పిటల్, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సీహెచ్‌వోలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగల్ రెడ్డి కోరారు. వైద్యఆరోగ్య శాఖ ఎన్‌హెచ్ఎం కింద పనిచేస్తున్న సీహెచ్‌వోలు తమ సమస్యల సాధన కోసం చేపడుతున్న సమ్మె శనివారం 13వ రోజుకు చేరింది. నగరంలోని శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల దీక్షా శిబిరాన్ని ఏపీ ఎన్జీవో నగర అధ్యక్షుడు ఎంసీ కాశన్నతో కలిసి సంఘీభావం తెలిపారు. వెంగల్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కులను కాలరాసిందని, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల కోసం కృషి చేస్తుందన్నారు. రెండేళ్లుగా జీతభత్యాల విషయంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటుందన్నారు. ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి దృష్టికి సీహెచ్‌వోల సమస్యలను తీసుకెళ్తానన్నారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలని, ఈపీఎఫ్‌ను పునరుద్ధరించాలని, అద్దె బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న సీహెచ్‌వోలకు ఎఫ్ఆర్‌సీ బయోమెట్రిక్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. అనంతరం దేశ రక్షణలో ప్రాణాలర్పించిన భారత సైనికుడు మురళీనాయక్‌కు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ గవర్నమెంటు నర్సెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సి.బంగారి, ఏపీఎన్జీవో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంటు ప్రభాకర్ రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి కృష్ణుడు, కోడుమూరు తాలుకా అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, నగర కార్యదర్శి రామకృష్ణ, నగర అసోసియేట్ ప్రెసిడెంటు ఆర్లె శ్రీనివాసులు, ఫార్మాసిస్టు సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రసిడెంటు వీరాంజనేయులు, ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌వోలు పాల్గొన్నారు.

సిపాయి తల్లులకు సెల్యూట్

జవాన్ తల్లి పాదాలు కడిగిన సీఐ, ఎస్ఐ


సిపాయి తల్లి కాళ్లను కడుగుతున్న సీఐ తబ్రేజ్

కోడుమూరు, మే 10(ఆంధ్రజ్యోతి): దేశం కోసం ప్రాణాలను పణంగా పెట్టి యుద్ధంలో పోరాటం చేస్తున్న సైనికుల తల్లిదండ్రులకు కోడుమూరు పోలీసులు సెల్యూట్ చేశారు. కోడుమూరుకు చెందిన సునీల్‌బాబు, వినోద్ ఇద్దరు జవాన్లు 'ఆపరేషన్ సిందూర్' యుద్ధంలో భాగంగా శత్రుదేశం పాకిస్తాన్‌తో పోరాటం చేస్తున్నారు. అలాగే మరో జవాన్ సునీల్ సెలవులను రద్దు చేసుకుని యుద్ధభూమిలో పోరాటానికై సరిహద్దు ప్రాంతానికి తిరిగి వెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న కోడుమూరు సీఐ తబ్రేజ్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం జవాన్ల తల్లిదండ్రులకు సన్మానం చేశారు. ఇంతటితో ఆగని సీఐ తబ్రేజ్, ఎస్ఐ ఎర్రిస్వామి ముగ్గురు సిపాయిల మాతృమూర్తులు ఆదిలక్ష్మి, నాగమణి, లక్ష్మీదేవి పాదాలను కడిగి పాదసేవ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పహల్గాంలో 26 మందిని పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులపై భారతదేశం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాకిస్తాన్‌పై యుద్ధం ప్రారంభించింది. ఇందులో త్రివిధళాల పని చేసే జవాన్లు ఉగ్రవాదుల స్థావరాలను టార్గెట్ చేసి పోరాటం చేస్తున్నారని గుర్తు చేశారు. యుద్ధంలో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన జవాన్ మురళీనాయక్ వీర మరణం పొందారని అన్నారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి


నివాళి అర్పిస్తున్న రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం

కోడుమూరు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరంట్లలో మొక్కజొన్న యంత్రంలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన సద్దల మద్దిలేటి కుటుంబాన్ని ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. శనివారం ఉదయం గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ కుటుంబ యజమాని మృతితో కుటుంబం పెద్దదిక్కు కోల్పోయిందని తెలిపారు. కూటమిప్రభుత్వం రైతు కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. అలాగే టీఎన్‌టీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు తిరుమలనాయుడు నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాజు, ఆటో యూనియన్ మధు ఉన్నారు.

లూపస్ వ్యాధి ప్రమాదకరం


మాట్లాడుతున్న డాక్టర్ సృజన

కర్నూలు హాస్పిటల్, మే 10 (ఆంధ్రజ్యోతి): శరీరంలోని ఇమ్యూనిటీ సిస్టమ్‌ను దెబ్బతీసే వ్యాధి లూపస్ అని కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌కు చెందిన కన్సల్టెంట్ రుమటాలజిస్టు డా.ఏ.సృజన అన్నారు. శనివారం వరల్డ్ లూపస్ డేను పురస్కరించుకుని హాస్పిటల్‌లో అవగాహన సదస్సు జరిగింది. ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు, నోట్లో పుండ్లు, నీరసం వంటి లక్షణాలు ఉంటే లూపస్ వ్యాధిగా గుర్తించి వైద్యులను సంప్రదించాలన్నారు. 10 మందిలో 9 మంది మహిళలకే ఈ వ్యాధి ఎక్కువగా వస్తుందని, ప్రతి ఏడాది వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్ కర్నూలు క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

ఆల్‌మేవా జిల్లా అధ్యక్షుడిగా ముక్తార్‌బాషా


ఆల్‌మేవా జిల్లా అధ్యక్షుడికి సన్మానం చేస్తున్న మైనార్టీ ఉద్యోగులు

కర్నూలు రూరల్ మే10(ఆంధ్రజ్యోతి): కర్నూలు మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్ మేవా) జిల్లా అధ్యక్షుడిగా కర్నూలు మండలం పీఆర్ ఏఈ ముక్తార్ బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం స్థానిక కర్నూలు మండల ప్రజాపరిషత్ సమావేశ భవనంలో కర్నూలు జిల్లా ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్య నిర్వాహక కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు ఇమ్రాన్‌బాషా, రాష్ట్ర కార్యవర్గం గౌరవ అధ్యక్షుడు ఎస్ఎండీ అబులైస్, రాష్ట్ర జనరల్ సెక్రటరీ అంజాద్‌పాషా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆల్‌మేవా నూతన కమిటీ లో కర్నూలు జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ మౌళీబాషా, అసోసియేట్ ప్రసిడెంట్ హుస్సేన్, వైస్‌ప్రసిడెంట్‌గా జాకీర్‌హుస్సేన్, పీఎండీ అబ్దుల్ కలీఖ్, మహమ్మద్‌హక్, హుస్సేన్‌సాబ్, జిల్లా జనరల్ సెక్రటరి షేక్‌మహమ్మద్‌రియాజ్‌బాషాతో పాటు మరి కొంతమంది ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా నంద్యాల జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్ఎండీ సలీమ్ వ్యవహరించారు.

పార్కుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి


19వ వార్డు రెవెన్యూ నాగిరెడ్డి కాలనీ పార్కులో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): కల్లూరు అర్బన్ పరిధిలోని పార్కుల్లో మౌలిక వసతులు కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి స్పష్టం చేశారు. శనివారం 19వ వార్డు రెవెన్యూ నాగిరెడ్డి కాలనీలోని మున్సిపల్ పార్కును సందర్శించి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. 19వ వార్డులోని పలు కాలనీలో సమస్యలు ఉన్నాయని, రోడ్లు, డ్రైనేజీ, పార్కుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పార్కులు అన్యాక్రాంతానికి గురి కాకుండా మున్సిపల్ అధికారులతో చర్చించి ప్రజలందరికీ ఉపయోగపడేలా తీర్చిదిద్దుతామన్నారు. ఈ మేరకు ప్రజలు పార్కులో తలెత్తిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కర్నూలు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, పల్లె రకఘునాథరెడ్డి మైనార్టీ నాయకులు చాంద్‌బాషా, శ్రీకాంత్, జనార్దన్ రెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు పునాది వేసుకోవాలి


క్రీడాకారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

కర్నూలు రూరల్ మే10(ఆంధ్ర జ్యోతి): తైక్వాండో క్రీడను విద్యార్థి దశ నుండి సాధన చేస్తూ సీనియర్ విభాగంలో వివిధ రాష్ట్ర, జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. మొదటి ఫెడరేషన్ నేషనల్ చాంపియన్‌షిప్ 2024-25 డివిజనల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పోటీలు మహారాష్ట్రలో గత నెల 25నుంచి 29 వరకు జరిగాయి. ఈ క్రీడా పోటీల్లో కర్నూలు జిల్లా నుంచి క్రీడాకారులు పాల్గొని మూడు బంగారు పతకాలు, రెండు కాంస్య పతకాలను సాధించిన క్రీడాకారులను ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సురేష్, తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ కర్నూలు ప్రసిడెంట్ చేతన్‌కుమార్, కోచ్‌లు సుజన్, మహబూబ్‌బాషా, ఉదయ్, వినీత్, వాణి పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవస్వామి కల్యాణం


స్వామి, అమ్మవార్లకు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఓర్వకల్లు, మే 10 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో వెలసిన శ్రీదేవి భూదేవి సహిత చెన్నకేశవస్వామి మహోత్సవాల సందర్భంగా శనివారం తెల్లవారుజామున శ్రీదేవిభూదేవి సహిత చెన్నకేశవస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయం ఈవో చంద్రశేఖర్ రెడ్డి, ఫెస్టివల్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈకార్యక్రమం చేపట్టారు. స్వామి,అమ్మవార్లకు అర్చకులు విష్ణుశర్మ, నారాయణ శర్మ విశేష పూజలు నిర్వహించి, స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను దేవస్థానం ఆధ్వర్యంలో సమర్పించారు. వేడుకల్లో గ్రామ నాయకుడు గోవిందరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, భాస్కర్ రెడ్డి, ఫెస్టివల్ కమిటీ సభ్యులు వెంకట్రామిరెడ్డి, వెంకటరమణారెడ్డి, లలితమ్మ, కురువ లక్ష్మీదేవి, వడ్డె భువనేశ్వరి, బోయ లక్ష్మీదేవి, దేవయ్య, మంగళి రవిశంకర్, గుర్రం రత్నమ్మ పాల్గొన్నారు.

● మండలంలోని నన్నూరు గ్రామంలోని జాతీయ రహదారి సమీపాన వెలసిన ఆదిచింతల మునిస్వామి నల్లారెడ్డి మద్దిలేటి స్వామి ఆలయాల్లో శుక్రవారం లక్ష్మీసమేత మద్దిలేటిస్వామి, నరసింహస్వాముల కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీ సమేత మద్దిలేటి స్వామి, నరసింహస్వామి ఉత్సవమూర్తులను ఆలయాల భజన బృందాలతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విశ్వేశ్వరరెడ్డి గ్రామ నాయకులు, తహసీల్దార్ విద్యాసాగర్, నన్నూరు, కర్నూలు వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన భజన పోటీలు


భజన విజేతలకు నగదు అందజేస్తున్న దాతలు

ఓర్వకల్లు, మే 10 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లులో వెలసిన శ్రీదేవి భూదేవి సహిత చెన్నకేశవ స్వామి కల్యాణ మహోత్సవాల సందర్భంగా దాతల సహకారంతో ఏర్పాటు చేసిన భజన పోటీలు శనివారం తెల్లవారుజామున ముగిశాయి. ఈ పోటీల్లో మొదటి విజేతగా పుల్లగుమ్మి వీరబ్రహ్మేంద్రస్వామి భజన మండలి రూ.20వేలు, రెండో విజేతగా ఉయ్యాలవాడ పూల పెద్దమ్మ భజన మండలి నిలిచి రూ.15వేలు, మూడో విజేతగా గణేష్‌నగర్ అభయాంజనేయ భజన మండలి నిలిచి రూ.10వేల నగదును గెలుచుకున్నాయి. దాతలు విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఈవో చంద్రశేఖర్ రెడ్డి,, నాయకులు గోవిందరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, రాంభూపాల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, నాగేశ్వరరావు, నాగశేషులు తదితరులు పాల్గొన్నారు.

● శ్రీదేవి భూదేవి సహిత చెన్నకేశవస్వామి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 12వ తేదీన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు శనివారం తెలిపారు. ఈ పోటీలో పాల్గొను టీం సభ్యులు ప్రవేశ రుసుం రూ.300లు చెల్లించి రషీదు పొందాలన్నారు. మరిన్ని వివరాలకు 9849529343, 9182639342లను సంప్రదించాలన్నారు.

'నవోదయం'తోనే మద్యపానం, వ్యసన విముక్తి

కర్నూలు అర్బన్, మే 10(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో మద్యపానం, వ్యవసన విముక్తి కోసం విస్తృత ప్రచారం చేస్తున్నామని ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజశేఖర్‌గౌడ్ అన్నారు. శనివారం కర్నూలు మండలం మునగాలపాడు గ్రామం కేర్ కమిటీ ఆధ్వర్యంలో నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా మద్యపానం, వ్యసనంపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కేర్ సభ్యులు జనార్ధన్, అల్కహాల్ అనోనీమస్ ఎన్జీవో రాజేంద్ర ప్రసాద్, సీఐ చంద్రహస్, ఎస్ఐ నవీన్ బాబు, వెంకటరాజు పాల్గొన్నారు.

● నగరంలోని బంగారుపేట కాలనీల్లో నాటు సారా స్థావరాలపై ఎక్సైజ్ శాఖ దాడులు నిర్వహించింది. శనివారం సాయంత్రం జరిపిన దాడుల్లో 200 లీటర్ల నాటుసారా తయారీకి పని వచ్చే బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఎస్ రాజశేఖర్‌గౌడ్, రామకృష్ణారెడ్డి, సీఐలు రాజేంద్ర ప్రసాద్, చంద్రహస్ సిబ్బంది పాల్గొన్నారు.

భారత రక్షణ దళాలకు అండగా ఉంటాం

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్


విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్ ఉగ్రవాదులతో యుద్ధం చేస్తున్న భారత్ రక్షణ దళాలకు భారతదేశ పౌరులందరూ అండగా ఉంటారని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. శనివారం నగరంలోని ఎ.క్యాంపు ఆదిత్యనగర్‌లో నూతనంగా ఆధునికీకరణ చేసిన సాయి సుబ్రహ్మణ్యేశ్వర జ్ఞాన మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ మనం ఏమి ఇచ్చినా సైనికుల రుణం తీర్చుకోలేనిదని అన్నారు. సైనికులు తమ కుటుంబాలను వదులుకొని, దేశ ప్రజల రక్షణకు తమ ప్రాణాలను ధారపోస్తున్నారని కొనియాడారు. అటువంటి సైనికులకు అండగా ఎల్లప్పుడూ ఉంటామని, వారికి విజయం చేకూరాలని ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టి. విజయకుమార్, లక్ష్మయ్య, సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు

రాష్ట్ర కబడ్డీ పోటీలకు కల్యాణ్



ఆదోని అగ్రికల్చర్, మే 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పట్టణంలోని జ్యోతినగర్‌కు చెందిన బి.కల్యాణ్ ఎంపికైనట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి సుబాకర్, ఫిలిప్స్ కబడ్డీ కోచ్ అమర్ ప్రకాష్ తెలిపారు. ఈనెల 11 నుంచి విజయవాడలో రాష్ట్ర జట్టుకు కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు.

సార్వత్రిక సమ్మెకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ అధ్యక్షుడు అజయ్‌బాబు

ఆదోని అగ్రికల్చర్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ప్రతి ఒక్కరు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సురేష్ పిలుపునిచ్చారు. శనివారం రెవెన్యూ భవనంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను తూట్లు పొడుస్తున్నాయని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ, వైఎస్ ఆర్‌టీయు, ఐఎన్‌టీయూసీ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, దేవా, గోపాల్, వెంకన్న, లక్ష్మారెడ్డి, నాగరాజ, ప్రకాష్, వీరన్న, మల్లికార్జున, లింగన్న పాల్గొన్నారు.

యుద్ధంలో గెలుపు కోసం పూజలు



పూజలలో పాల్గొన్న నాయకులు, ప్రజలు

ఆదోని టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద అణిచివేతకు చేస్తునన యుద్ధంలో భారతదేశం విజయం సాధించాలని ఆంజనేయస్వామి ఆలయంలో బీజేపీ నాయకులు పూజలు నిర్వహించారు. ఆ పార్టీ కో కన్వీనర్ నాగరాజు గౌడ్ మాట్లాడుతూ, ఉగ్రవాద సంస్థలు భారతదేశ సహనం, సంయమనం, శాంతిని మాత్రమే చూశారని, యుద్ధం చేస్తే ఎలా ఉంటుందో ఇకముందు చూస్తారని అన్నారు. భారత్ వైఖరిని ప్రపంచ దేశాలు హర్షిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వినోద్ కుమార్,న భాగ్య, రాజ్ కుమార్, శేఖర్, వినోద్, నాగరాజు, శివరాం, హనుమంతు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు భవనం నిర్మించాలి

ఆదోని అగ్రికల్చర్, మే 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనాన్ని నిర్మించాలని సీడీఎస్‌వో నాయకుడు తిరుమలేష్, డీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉదయ్ డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న విద్యార్థి నాయకులు

శనివారం స్థానిక కార్యాలయంలో పీడీఎస్‌వో, డీఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కళాశాల అద్దె భవనంలో అరకర సౌకర్యాలతో ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరానికైనా నిధులు మంజూరు చేయాలని కోరారు. శివ, అనుమేష్, రాజేష్, రఘు పాల్గొన్నారు.

రేపు వెంకప్ప స్వామి ఆరాధన

మద్దికెర, మే 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ సమీపంలోని ఆవధూత వెంకప్పస్వామి ఆరాధన ఈనెల 12న నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటలకు సత్యనారాయణ స్వామి పూజ, ఆకుపూజ, మహా మంగళహారతి ఉంటుందన్నారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పల్లకి మహోత్సవం ఉంటుందన్నారు.

బీజేపీ నాయకుల పూజలు



పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

పత్తికొండ టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావాలని బీజేపీ నాయకులు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కరణం నరేష్ ఆధ్వర్యంలో శనివారం తేరుబజారులోని పెద్దాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. సైనికుల త్యాగాలను గుర్తించుకోవాలన్నారు. బ్రహ్మయ్య, లక్ష్మణస్వామి నాయుడు, నరసింహుడు, వీరేష్, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

పాకిస్థాన్‌కు తీవ్ర పరిణామాలు తప్పవు : సీపీఐ



పత్తికొండలో కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న నాయకులు

పత్తికొండ టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): కవ్వింపు చర్యలు మానకుంటే పాకిస్థాన్‌కు తీవ్ర పరిణామాలు తప్పవని సీపీఐ కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య హెచ్చరించారు. వీర మరణం పొందిన వీరజవాన్ మురళీనాయక్‌కు నాలుగు స్తంభాల కూడలిలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. పర్యాటకును హతమార్చడం దుర్మార్గమన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో మన సైన్యం పాకిస్థాన్‌లోని సామాన్య ప్రజలను చంపకుండా కేవలం ఉగ్రవాదుల స్థావరాలపైనే దాడులు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజాసాహెబ్, రామాంజనేయులు, సురేంద్ర కుమార్, కృష్ణ, సుల్తాన్, సిద్దలింగప్ప, నెట్టికంటయ్య, గుండు బాషా తదితరులు పాల్గొన్నారు.



సంవత్సరాల క్రితం నాటిన చెట్లను బుగ్గి చేస్తున్నారు. పత్తికొండ-హోసూరు రహదారి ప్రక్కలా చెట్లతో చూడ ముచ్చటగా ఉంటాయి. చెట్ల నీడలో వాహనదారులు, పాదచారులు సేదదీరుతారు. కొందరు స్వార్థపరులు చెట్లకు రాత్రివేళల్లో నిప్పు పెడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - పత్తికొండ టౌన్



పట్టణానికి వచ్చేవారి సౌకర్యార్థం ఎమ్మిగనూరు సర్కిల్‌లో బయోటాయిలెట్ మూత పడింది. ట్యాంకు, బోరు అన్ని ఏర్పాటు చేసినా ప్రారంభించకుండా వదిలేశారు. టాయిలెట్ చుట్టు పక్కల స్థానికులు కాలకృత్యాలు తీర్చుకుంటుండటంతో దుర్వాసన వస్తోంది. టాయిలెట్‌ను తెరవాలని స్థానికులు కోరుతున్నారు. - ఆదోని అగ్రికల్చర్



మండలంలోని గ్రామాల్లో చెత్త సేకరణకు ప్రభుత్వం చెత్తబుట్టలు పంపింపిది. అధికారుల పుణ్యమా అని సచివాలయానికే పరిమితమయ్యాయి. పది, ఇరవై వరకు పంపిణీ చేసిన అధికారులు మిగతా వాటిని ఇలా మూలకు పడేశారు. వీటిని గ్రామాల్లో పంపిణీ చేస్తే చెత్త సేకరణకు అణువుగా ఉండే అవకాశం ఉంది. - తుగ్గలి

అడ్డంగా తవ్వేస్తున్నారు

- పైప్‌లైన్ కోసం నూతన రహదారి ధ్వంసం



టీచర్స్‌కాలనీ వద్ద కొత్తగా వేసిన సీసీ రోడ్డును తవ్వుతున్న దృశ్యం

పత్తికొండ, మే10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్‌కాలనీలో గత నెలలో రూ.లక్షలు ఖర్చుచేసి సీసీరోడ్డు వేశారు. అయితే కాలనీకి చెందిన ఓ వ్యక్తి తన ఇంటి పైప్‌లైన్ కాలువకు కలిపేందుకు శనివారం రహదారిని అడ్డంగా తవ్వేశాడు. ఇంత జరుగుతున్నా రోడ్డు కోసం పోరాడిన కాలనీవాసులు గానీ, అధికారులు గాని పట్టించుకోకపోవడం విచారకరం.

టెస్టింగ్ చాంబర్‌ను తొలగించాలి

- ఏరియా ఆసుపత్రిలో దారికి అడ్డం



సగం దారిని ఆక్రమించిన చాంబర్

ఆదోని టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో కరోనా సమయంలో టెస్టింట్ చాంబర్‌ను ఏర్పాటు చేశారు. అక్కడే కరోనా రోగులకు పరీక్షలు చేసేవారు. అయితే కరోనా అనంతరం దీన్ని తొలగించకుండా అలాగే ఉంచడంతో రోగుల రాకపోలకు ఇబ్బందిగా మారింది. ఈ మార్గంలో గాలి, వెలుతురు కూడా సరిగి రావడం లేదు. సగం దారి దీనికే వెళ్లిపోవడంతో ఇరుకుగా మారిందని, వెంటనే దీన్ని తొలగించాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహమ్మద్ కోరారు.

మురళీనాయక్ త్యాగాన్ని మరచిపోం



పత్తికొండలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పత్తికొండ, మే10 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో జరగుతున్న యుద్దంలో ప్రత్యర్థిసైన్యంలో ఐదుగురిని హతమార్చి శత్రు తుటాలకు నెలకొరిగిన తెలుగుబిడ్డ మురళీనాయక్ త్యాగాన్ని దేశం మరువద్దని టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, రామానాయుడు, తిరుపాల్, సోమ్లానాయక్ అన్నారు. శనివారం పత్తికొండ టీడీపీ కార్యాలయంలో నివాళి అర్పించి, రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. రైల్వేలో ఉద్యోగమొచ్చినా సైన్యంలో చేరాడన్నారు. 24ఏళ్ల వయసులోనే వీరమరణం పొందాడన్నారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. అనంతరం నాలుగు స్తంభాల కూడలిలో నినాదాలు చేశారు. టీడీపీ నాయకులు కడవల సుధాకర్, తిమ్మయ్య చౌదరి,లోక్‌నాద్, బీటీగోవిందు, సిఐ జయన్న సిబ్బంది ఉన్నారు.

తుగ్గలి: పాకిస్థాన్‌తో యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ సేవలు మరువలేనివని టీడీపీ నాయకులు తిరుపాల్ నాయుడు, మైరాముడు, మారెన్న అన్నారు. శనివారం జవాన్ చిత్రపటానికి నివాళి అర్పించారు.

బెల్లం ఊట ధ్వంసం.. సారా స్వాధీనం

వెల్దుర్తి, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎల్.తండాలో కర్నూలు ఎన్‌ఫోర్స్‌మెంట్, కోడుమూరు ఎక్సైజ్ అధికారులు శనివారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. వివరాల మేరకు.. 960 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి , 26 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సారా విక్రయదారులు సంతోశ్‌నాయక్, సుబ్బిబాయి, లలితాబాయిని అరెస్టు చేసి కేసు నమోదుచేశారు. సీఐలు మంజుల, క్రిష్ణ, ఎస్ఐలు చంద్రమోహన్, రవితేజ, ఇంద్రకరణ్ తేజ పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేపై విమర్శలు తగవు'

ఆలూరు, మే 10(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేస్తున్న ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షిపై కూటమి నేతల విమర్శలు తగవని వైసీపీ కన్వీనర్ మల్లికార్జున, మాజీ ఎంపీటీసీ భాస్కర్ నాయుడు అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్న ఎమ్మెల్యేపై విమర్శలు మానుకోవాలన్నారు. తమ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకే ఎమ్మెల్యే అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడం లేదని వారు తెలిపారు.

కాలువలో పూడిక, గడ్డి

- తొలగించాలని కోరుతున్న రైతులు



పూడిక, గడ్డితో నిండిన పిల్ల కాలువ

హాలహర్వి, మే 10 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర దిగువ కాలువ కంద ఉన్న పిల్ల కాలువలు నిర్వహణా లోపంతో పూడిక, గడ్డితో నిండిపోయింది. దీంతో చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు. జలవనరుల శాఖ అధికారులు స్పందించి, కాలువకు నీరొచ్చేలోపు పూడిక తీస్తే తమకు సాగునీరు అందుతుందని రైతులు కోరుతున్నారు.

15న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

మద్దికెర, మే 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలుర పాఠశాలలో ఈ నెల 15న కేతః యువసేన ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.40వేలు, రెండో బహుమతి రూ.20వేలు ఉంటాయన్నారు. రూ.1,200లు పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 8247755721, 7569909250 నెంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యుత్ సమస్య తీరింది



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మద్దికెర, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి, బసినేపల్లి, మదనంతపురం గ్రామాల ప్రజలకు విద్యుత్ సమస్య తీరిందని టీడీపీ నాయకులు కేవీ రాజేశ్వర చౌదరి, నర్రా సుధాకర్ అన్నారు. శనివారం పెరవలి గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కృషితో రూ.3 కోట్లతో పెరవలి గ్రామానికి విద్యుత్ సబ్ స్టేషన్ మంజూరైందన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

తుగ్గలి, మే 10 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలలో విద్యాభివృద్దికి కృషి చేద్దామని జొన్నగిరి జడ్పీహెచ్ పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ మిద్దె రవికుమార్ యాదవ్ అన్నారు. శనివారం మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు కల్పించామని, టీడీపీ పభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. పదో తరగతిలో ప్రతిభ కనబరిచిని విద్యార్థులకు రూ.10వేలు అందజేస్తున్నామని, తెలిపారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ స్వామి తదితరులు ఉన్నారు.

ప్రారంభానికి అడ్డంకులు

- దాతలు ఇచ్చిన స్థలంలో పాలిటెక్నిక్ భవన నిర్మాణం
- తమ పేరు పెట్టాల్సిందేనంటున్న దాతలు.. జీవో రాలేదంటున్న ప్రిన్సిపాల్



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పాలిటెక్నిక్ భవనం ఇదే

ఆలూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు సొంత భవనం నిర్మాణం పూర్తయింది. ఈ నెల 12న ప్రారంభించాలని ఉన్నతాధికారులు కళాశాల సిబ్బందిని ఆదేశించారు. అయితే కొందరు దాతలు కళాశాలకు తమ పేర్లు పెట్టాలన్న ఒప్పందంతో స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. ఆ స్థలంలోనే భవనం కూడా నిర్మించారు. అగ్రహారం, యాటకల్ గ్రామాలకు చెందిన దాతలు నాగిరెడ్డి, సంజీవరెడ్డి 2018లో సర్వే నెం. 877లో 5 ఎకరాలను విరాళంగా ఇచ్చారు. దీంతో ప్రభుత్వం రూ.8 కోట్లతో నూతన భవనంను నిర్మించింది. తీరా తమ పేర్లు పెట్టకుండానే ప్రారంభిస్తున్నారని దాతలు అధికారులపై మండి పడుతున్నారు. దీంతో భవనాన్ని ఎలా ప్రారంభిచాలో తెలియక కళాశాల అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

కళాశాల భవనానికి స్థల దాతల పేర్లు పెట్టేందుకు జీవో ఇవ్వాలని పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదించాం. ఈ నెల 12న నూతన భవనంలోకి చేరాలని ఉన్నతాధికారుల ఆదేశాలు వచ్చాయి. అయితే స్థల దాతలు తమ పేర్లు పెట్టకుండానే ప్రారంభించడంపై అభ్యంతరం తెలుపుతున్నారు. దీంతో భవనం ప్రారంభించడం ఇబ్బందిగా మారింది. ఉన్నతాధికారులే నిర్ణయం తీసుకోవాలి.



- డాక్టర్ చిన్నపుపరెడ్డి, ప్రిన్సిపాల్

వైద్య పరీక్షలు చేయించుకోవాలి



మహిళలకు సూచనలు ఇస్తున్న వైద్యాధికారి శ్రీలక్ష్మి

మద్దికెర, మే 10 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, మహిళలు క్రమంగా ప్రభుత్వ వైద్యశాలలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి శ్రీలక్ష్మి సూచించారు. శనివారం ఎం.అగ్రహారం గ్రామంలో గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక జబ్బులు ఉన్న వారికి ఆసుపత్రిలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. పౌష్టికాహారం తీసుకుంటే గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రసవానికి వైద్యశాలకు రావాలన్నారు. ఏఎన్ఎం గాయత్రి ఉన్నారు.

టీడీపీ నాయకుల నివాళి



వెల్దుర్తిలో జవాన్‌కు నివాళి అర్పిస్తున్న నాయకులు

వెల్దుర్తి, మే 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ కన్వీనర్ బలరాంగౌడ్ ఆధ్వర్యంలో వీరజవాన్ మురళీ నాయక్‌కు నివాళి అర్పించారు. దేశ సరిహద్దుల్లో శత్రువుతో పోరాడుతూ మురళీ నాయక్ వీరమరణం పొందారన్నారు. సైనికుల త్యాగాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో రామకృష్ణాచారి, రాఘవేంద్రగౌడ్, రామస్వామి, శ్రీను పాల్గొన్నారు.

ఉపాధి కార్యాలయం మార్పు



ఆలూరులోని స్త్రీశక్తి భవనం

ఆలూరు, మే10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నూతనంగా నిర్మించిన సచివాలయం-2లోకి ఉపాధి కార్యాలయాన్ని మార్చడంతో అంబేడ్కర్ భవన్‌లో కొనసాగుతున్న సచివాలయం-2 సిబ్బంది అభ్యంతరం తెలిపారు. సచివాలయ భవనాన్ని తమకే స్వాధీనం చేయాలని ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీడీవో ఉపాధి సిబ్బంది ని మోడల్ స్కూల్ పక్కన ఉన్న స్త్రీశక్తి భవనంలోకి మారాని సూచించారు. చివరకు ఉపాధి కార్యాలయాన్ని స్త్రీ శక్తి భవన్‌లోకి తరలించినట్లు ఏపీవో శ్రీనివాసులు తెలిపారు.

అభివృద్ధికి దూరంగా..

- ఆస్పరి స్టేషన్‌పై రైల్వే అధికారుల చిన్నచూపు
- గతంలో సరుకు రవాణా, నేడు కళావిహీనం, హాల్ట్ లేక ప్రయాణికుల అవస్థలు



ఆస్పరి, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులతో కిక్కిరిసిపోవలసిన ఆస్పరి రైల్వేస్టేషన్ నిర్మానుష్యంగా మారింది. అసలు ఇక్కడ స్టేషన్ ఉందా? అన్న అనుమానం కలగక మానదు. గతంలో ఈ ప్రాంతం నుంచి కూరగాయలు, తదితర వ్యవసాయ ఉత్పత్తులను రైలులో ఎగుమతి చేసేవారు. మహా నగరాలైన ముంబై, పూనే, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, నగరాలకు ఇక్కడి పంట ఉత్పత్తులను ఎగుమతి చేసేవారని సమాచారం.

స్టాపింగ్ ఏర్పాటు చేయాలి

ఆస్పరి మీదుగా నిత్యం రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఇక్కడ హాల్ట్ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కనీసం ప్యాసింజర్ రైళ్లు కూడా ఆపకపోవడంతో స్టేషన్ కళావిహీనంగా మారింది. రైల్వే అధికారులు స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

స్టేషన్‌ను అభివృద్ధి చేయాలి

మండల కేంద్రంలోని స్టేషన్‌ను అభివృద్ధి చేయాలి. అలాగే రైళ్లకు స్టాపింగ్ ఏర్పాటు చేయాలి. ప్రయాణికులను అనుకూలంగా మార్చాలి.

- మేకల రంగనాథ్, ప్రయాణికుడు, ఆస్పరి

ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

ఆస్పరి రైల్వే స్టేషన్‌లో సమస్యలు ఉన్న మాట వాస్తవమే. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం. రైలు స్టాపింగు సరుకుల ఎగుమతి, దిగుమతుల విషయాలను కూడా వారికి తెలియజేస్తాం.- ఆర్ఎస్ యాదవ్, స్టేషన్ మాస్టర్ ఆస్పరి

అండగా ఉంటాం : ఎమ్మెల్యే బీవీ



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

గోనెగండ్ల, మే 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ కోసం పనిచేసిన కార్యకర్తల కుటుంబాలకు అన్ని విధాల అండగా ఉంటామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని పెద్ద నేలటూరు చర్చి ప్రారంభోత్సవానికి ఆయన హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామ టీడీపీ నాయకుడు వెంకట్రాముడు భార్య రాములమ్మ అనారోగ్యంతో ఉందని తెలుసుకొని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. వైద్యుల రిపోర్టులను ఆయన పరిశీలించి, అన్ని విధాల అండగా ఉంటామని బీవీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు మూల్యం చెల్లించక తప్పదు



మాట్లాడుతున్న రామాంజనేయులు

ఎమ్మిగనూరు టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలకు ఉద్యమాల ద్వారా తగిన బుద్ధి చెప్పాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బి రామాంజనేయులు అన్నారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో సీఐటీయూ మండల అధ్యక్షులు గోవిందు అధ్యక్షతన సమావేశంలో వారు మాట్లాడుతూ నాలుగు కార్మిక వ్యతిరేక లేబర్ చట్టాల రద్దుకై మే 20న దేశవ్యాప్తంగా తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తిమ్మగురుడు, ప్రసాద్, ఎస్ రాజు, బాలరాజు, రాముడు, ఆసీఫ్, నరసయ్య, ఉస్మాన్, నరసింహరెడ్డి, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా ఖాలిక్

కోసిగి, మే 10 (ఆంధ్రజ్యోతి): కోసిగి ఏపీవోగా పనిచేస్తున్న ఖాలిక్‌ను శనివారం కర్నూలు జిల్లా కేంద్రంలో మైనార్టీస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో ఆదోని రెవెన్యూ డివిజన్ తరుపున జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. దీంతో ఆయనను అసోసియేషన్ నాయకులు పూలమాలతో ఘనంగా సత్కరించారు.

ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

గోనెగండ్ల, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో ఇంటి గుత్తల రసీదుకు ఆ ఇంటి యజమాని ఆధార్‌లింక్ ను అనుసంధానం చేసుకోవాలని ఈవోఆర్‌డీ అనంతశయనా, గోనెగండ్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్ కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో గృహాలను ఆన్‌లైన్ చేసుకునే కార్యక్రమం ముగిసింది అయితే అనుకోని సందర్భాలలో కొన్ని తప్పుఒప్పులు జరిగి ఉండవచ్చుని, గృహాలవారు ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయం దగ్గరకు వెళ్లి మరోసారి సరిచూసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరి ఇన్స్‌పెక్టర్ మలాంగ్, సుబాన్, అనిల్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగో రోజుకు చేరిన కార్మికుల సమ్మె

ఎమ్మిగనూరు టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు మరియు న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల అధ్యక్షులు నారాయణ డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు నాలుగవ రోజు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా శనివారం అధ్యక్షులు నారాయణ ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా ఇంజనీరింగ్ సెక్షన్‌లో వివిధ విభాగాల్లో పని చేస్తూ చాలీచాలని జీతాలతో, పెరిగిన ధరలతో జీవనం సాగించడం కష్టమైందన్నారు. కనీస వేతనం అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో నరసప్ప, విజయ్‌కుమార్, శ్రీరాములు, పంపాపతి, సాయి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పీవీ రావుకు ఘన నివాళి



పీవీ రావుకు నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : మాల మహానాడు వ్యవస్థాపకులు పోతుల విఘ్నేశ్వరరావు(పీవీ రావు) 76వ జయంతి వేడుకలు ఆ సంఘం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. శనివారం స్థానిక సంజీవనగర్‌లోని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసన్న స్వగృహంలో పీవీ రావు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాల మహానాడు వ్యవస్థాపకుడు పి వీరావు, అంబేడ్కర్ భావజాలంతో ముందుకు నడిచారని అన్నారు. కొంత మంది కులాన్ని అడ్డుపెట్టుకొని నాయకులుగా మారి రాజకీయ పార్టీలకు అమ్ముడుపోయారని అన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు తాలుకా అధ్యక్షుడు రవిచంద్ర, పట్టణ అధ్యక్షుడు చేన్నయ్య వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

గోనెగండ్ల, మే 10(ఆంధ్రజ్యోతి): ఎంతకాలం వివక్షతలకు, అంటరానితనాన్ని భరిందాం ఇకనైనా ఎదిరించి అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం గోనెగండ్ల లో కేవీపీఎస్ నాయకులు సమావేశం నిర్వహించారు. కేవీపీఎస్ నాయకులు కరుణాకర్, జయరాజు, విజయమ్మ, భాస్కర్, పెద్దబాబు, మారయ్య, యేసురాజు, తిమ్మన్న, ఆంతోని మదనగోపాల్, వీరేష్, హనుమంతు, నాగన్న, నాగరాజు, పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

కోసిగి, మే 10 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతారని, వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ భార్గవ్ రెడ్డి హెచ్చరించారు. శనివారం కోసిగి ప్రభుత్వ ఆసుపత్రిలో ఎక్సైజ్ డిప్యూటీ కమిష నర్ శ్రీదేవి, సూపరింటెండెంట్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు కేర్ కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. డా.రజిత, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఎక్సైజ్ ఎస్ఐ, కార్తిక్‌సాగర్, హెడ్ కానిస్టేబుల్ కిషోర్, కానిస్టేబుల్స్ ముని రంగడు, భరత్ ఉన్నారు.

సమస్యల సంత



● ఆదాయం ఉన్నా.. సౌకర్యాలు సున్నా
● తాగునీరు కరువు
● రోడ్లపైనే పశువుల క్రయవిక్రయాలు
● అలంకారప్రాయంగా నీటి ట్యాంక్
● ఎండకు విలవిలాడుతున్న రైతులు, జీవాలు
● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే ఎమ్మిగనూరు పట్టణంలో జరిగే సంత పెద్దది. ఈ సంతకు జిల్లా నుంచే కాక కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి రైతులు, వ్యాపారులు వస్తారు. ఇక్కడికి భారీగా గొర్రెలు, మేకలు, పశువులను తీసుకొస్తారు. అయితే సంతకు ఆదాయం లక్షల్లో ఉన్నా, సౌకర్యాలు కల్పించడంలో మాత్రం అధికారులు శ్రద్ధ చూడపం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. తాగు నీరు, మరుగుదొడ్లు కూడా లేవు. ఉదయం 8 గంటలకే ఎండలు మండుతుండడంతో ఎండలకు గంటల తరబడి నిలబడలేక నానా అవస్థలు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంతకు స్థలం లేక రోడ్లపైనే క్రయవిక్రయాలు జరుగుతున్నాయి.

ఎమ్మిగనూరు, మే 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు సంత సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఎమ్మిగనూరు పురపాలక సంఘానికి ఆరు మార్కెట్ల నుంచి సాలీనా రూ.78లక్షల ఆదాయం సమకూరుతున్నా మార్కెట్లలో కనీస సౌకర్యాలు కనిపించటం లేదు. మార్కెట్లకు వచ్చే రైతులు, వ్యాపారులు ఎండకు ఎండుతూ.. వానకు నానుతూ పడుతున్న పాట్లు వర్ణణాతీతం. మార్కెట్లలో మనుషులకు అటుంచితే.. పశువులకు నీటి తొట్టిలు ఏర్పాటు చేయకపోవటంతో రైతులు, వ్యాపా రులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. పట్టణంలోని సంతలో గొర్రెల మార్కెట్, కర్నూలు బైపాస్ రోడ్డులో పశువుల మార్కెట్ కొనసాగుతోంది. గొర్రెల మార్కెట్‌లో





సంతలో నీడ కరువు

ఏమాత్రం సౌకర్యాలు కనిపించటం లేదు. సంత మార్కెట్ రోడ్డుపైన, పాఠశాల పక్కన ఉన్న రహదారిపైన జీవాలు (గొర్రెలు, మేకలు) క్రయవిక్రయాలు జరుగుతుంటాయి. ప్రతి ఆదివారం వేలాది సంఖ్యలో అమ్మకానికి వస్తుంటాయి. మార్కెట్‌లో ఉన్న స్థలం ఏమాత్రం సరిపోక రోడ్డుపైనే క్రయవిక్రయాలు సాగిస్తుంటారు. ఈ మార్కెట్‌నుంచి సాలీనా రూ.17.20లక్షలు ఆదాయం సమకూరుతున్నా మున్సిపల్ అధికారులు ఎలాం టి సౌకర్యాలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. ఇక్కడకు ఎమ్మిగనూరు నుంచే కాకుండా పత్తికొండ, ఆదోని, గూడూరు, బెళగల్, తెలంగాణలోని ఐజ, కర్ణాటకలోని రాయచూరు జిల్లా నుంచి రైతులు, వ్యాపారులు తమ పశువులను అమ్ముకునేందుకు తరలివస్తారు. ఇంత ఆదాయం వస్తున్నా మార్కెట్‌లో కనీసం తాగేందుకు గుటికెడు నీళ్లు లభించటం లేదు. గతంలో ఏర్పాటు చేసిన బోరు, కొళాయిలు పూర్తిగా ధ్వంసం కాగా ఇటీవల ఏర్పాటుచేసిన మినీ నీటిట్యాంకు సైతం అలంకార ప్రాయంగా మారింది. బోరు పనిచేయక పోగా కుళాయిలు సైతం విరిగిపోయి కనిపిస్తున్నాయి. రైతులు పక్కనే ఉన్న హోటల్‌లో దాహం తీర్చుకుంటున్నారు. పశువులకు మాత్రం నీరులేక ఎండకు నోరు ఎండిపోవాల్సిందే. ఇక పారిశుద్యం కథ దేవుడికేరుక. మార్కెట్లు నిత్యం కంపుకొడుతూనే ఉంటాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి గొర్రెల, పశువుల మార్కెట్లలో సమస్యలు పరిష్కరించాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

గుక్కెడు నీరు లేదు



జిల్లాలోని నందికొట్కూరు, డోన్ పశువుల మార్కెట్లలో నీటి సౌకర్యంతో పాటు ఇతర సౌకర్యాలున్నాయి. ఇక్కడ మాత్రం తాగటానికి గుక్కెడు నీరు లేదు. ముఖ్యంగా పశువులకు నీరు లేకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం.
- సుంకన్న, వ్యాపారి, పులకుర్తి

నీటిని నింపుతూ ఉండాలి



పశువులు, గొర్రెల మార్కెట్లలో తాగు నీటి సౌకర్యం ఏర్పాటుచేయాలి. పశువులకు నీటితొట్టిలు ఏర్పాటుచేసి మార్కెట్ పూర్తయ్యే వరకు నీటిని నింపుతూ ఉండాలి. మార్కెట్ ఆవరణంలో ఓ షెడ్డు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.
- ఎర్రన్న, గుడికల్



పశువుల మార్కెట్‌లో ధ్వంసమైన బోరు, నీటి కొళాయిలు

రేకుల షెడ్లను తొలగించండి



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్ఐ, టీడీపీ నాయకులు

కోసిగి, మే 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న జరిగే కోసిగయ్య స్వామి (ఆంజనేయస్వామి) తేరుబజారు మైదానంలో జరిగే రథోత్సవ వేడుకలకు అడ్డుగా ఉన్న దుకాణాల రేకులషెడ్లను వెంటనే తొలగించాలని ఎస్ఐ హనుమంతరెడ్డి వ్యాపారులకు ఆదేశించారు. గతంలో ఏ విధంగా అయితే.. రథోత్సవ సమయంలో రేకుల షెడ్లు తొలగించే దుకాణాదారులు ఈ ఏడాది కూడా వాటిని తొలగించి రథోత్సవం సవ్యంగా జరిగేందుకు అందరూ సహకరించాలని అన్నారు. అనంతరం తేరుబజారు మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆలయ పూజారులు, టీడీపీ నాయకులు పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, టీడీపీ నాయకులు నాడిగేని చిన్నతాయన్న, నాడిగేని అయ్యన్న, మాజీ జడ్పీటీసీ రామకృష్ణ, మాణిక్యరాజు, గవిగట్టు ఈరయ్య, చింతకుంట తాయన్న, జనార్దన్, బాబాయ్ ఈరేష్ నరసన్న, తదితరులు ఉన్నారు.

స్నేహితుడి కుమార్తె పెళ్లికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

గోనెగండ్ల, మే 10(ఆంధ్రజ్యోతి): స్థానిక పెయింటర్ రెహమాన్ కూతురు పెళ్లికి 1999లో గోనెగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.50 వేలు ఆర్థికసాయం అందజేశారు. వారు మాట్లాడ ుతూ స్నేహితుడి కుటుంబానికి అండగా ఉండటం సంతోషంగా ఉందన్నారు. పూర్వవిద్యార్థులు జాకీర్‌హుస్సేన్, చాంద్‌బాషా, వలి, షేక్షావలి, నూరుభాషా, స్నేహితులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ ఆసుపత్రి

●పెచ్చులూడుతున్న భవనం ● ఏళ్లైనా.. మరమ్మతులకు నోచుకొని వైనం ● ఇబ్బందుల్లో రోగులు

ఎమ్మిగనూరు టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : నిత్యం వందలాది మందికి వైద్యం అందించే ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాల భవనం శిథిలావస్థకు చెరింది. ప్రధానంగా వరండా దెబ్బతినడంతో కడ్డీలు కనిపిస్తున్నాయి. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో భవనం శిథిలావస్థకు చేరింది. ఈ ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని 1980 లో ఏర్పాటుచేశారు. ఈ ఆసుపత్రికి ఎమ్మిగనూరు, మంత్రాలయం, నియోజకవర్గాల నుంచే కాక చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, మాధవరం, నందవరం, నాగలదిన్నె బెళగల్ మండలాల నుండి కూడా ప్రజలు వైద్యం కోసం వస్తుంటారు. ప్రతి రోజు 300 నుంచి 400 మంది వైద్యం కోసం వస్తుంటారు డెలివరీ కేసులు, యాక్సిడెంట్



కూలడానికి సిద్ధంగా ఉన్న ఆసుపత్రి వరండా



పెచ్చులూడిన పైకప్పు

కేసులతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చరడంతో లోపల మాత్రమే మరమ్మతులు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఆసుపత్రిలో పెచ్చులూడిపోయి కడ్డీలు కనిపిస్తున్నాయి. లోపల బయటా గోడలు పగుళ్లు వచ్చి ఎప్పుడు కూలిపోతుందో అన్న భయంతో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఆసుపత్రి ఆవరణంలో పరిశుభ్రత లేకపోవడంతో బయట నుంచి పాములు వస్తున్నాయని వైద్యం కోసం వచ్చే వారు వాపోయారు .ప్రస్తుత ప్రభుత్వ ఆసుపత్రి పెచ్చులుడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 100 పడకల ఆసుపత్రిని త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకు వస్తే బాగుంటుందని ప్రజలు, రోగులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



మల్లేశ్వరి (ఫైల్)

నందవరం, మే 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జోహరాపురంలో కురవ మల్లేశ్వరి(34) శనివారం చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మల్లేశ్వరి భర్త శంకరప్ప ఇటీవల గ్రా మంలో పొలం కొన్నాడు. కొన్న పొలానికి రస్తా లేదని, ఎలా కొన్నావని భార్య భర్తతో గొడవ పడింది. ఇద్దరికి మాటా మాటా పెరగడంతో క్షణికావేశంలో భార్య మల్లేశ్వరి శుక్రవా రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగింది. వెంటనే బంధువులు, భర్త ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు..

నరసింహ స్వామికి మహాభిషేకం



మహాభిషేకంలో పాల్గొన్న భక్తులు

మంత్రాలయం, మే 10 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి సన్నిధానంలో శ్రీనరసింహస్వామి జయంతిని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు పూర్ణబోధా పూజా మందిరంలో ఏడాదికొకసారి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరిగే షోడాషాబాహు (16 చేతులు) నరసింహ స్వామికి మహాభిషేకం చేశారు. దేశం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు ఈ మహాభిషేకాన్ని తిలకించి మంత్ర ముగ్ధులయ్యారు. భక్తులు ఎక్కువగా రావడంతో శ్రీమఠం కిటకిటలాడింది. కార్యక్రమంలో ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్ జోషి, సురేష్ కోనాపూర్, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, రవి కులకర్ణి, ద్వారపాలక అనంతస్వామి, తంబిస్వామి, సుజీంద్రాచార్, తదితరులు పాల్గొన్నారు.

ధార్మిక పర్యటనకు వెళ్లిన పీఠాధిపతి

మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శనివారం మధ్యాహ్నం పూజలనంతరం ధార్మిక పర్యటనలో భాగంగా తన శిష్యబృందంతో కలిసి కర్ణాటకకు బయలుదేరి వెళ్లారు. నరసింహస్వామి జయంతి సందర్భంగా వ్యాసరాజ ప్రతిష్ఠాపించిన కర్ణాటకలోని ముడుబాగులలో జరిగే జయంతి ఉత్సవాల్లో పాల్గొని ఆదివారం రాత్రికి మంత్రాలయం చేరుకుంటారని మఠం అధికారులు తెలిపారు.

గోశాలకు పశుగ్రాసం విరాళం

మంత్రాలయం, మే 10 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి సన్నిధానంలో నెలకొల్పిన శ్రీమఠం గోశాలకు కర్నాటక గంగావతి, సిందనూరు గ్రామాలకు చెందిన రైతులు 5 ట్రాక్టర్ల పశుగ్రాసాన్ని విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేశ్ జోషీ, సురేష్ కోనాపూర్ తెలిపారు. పశుగ్రాసం ఇచ్చిన రైతులకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. సూపరింటెండెంట్ అనంతపురాణిక్, గోశాల సూపర్‌వైజర్ రాఘవేంద్ర దేశాయ్ పాల్గొన్నారు.

వీరజవాన్‌కు ఘన నివాళి

కౌతాళం, మే 10(ఆంధ్రజ్యోతి): సరిహద్దులో జరుగుతున్న భీకర యుద్ధంలో వీర మరణం పొందిన సైనికుడు మురళీనాయక్ త్యాగం మరవలేనిదని టీడీపీ నాయకుడు వెంకటపతి రాజు, మాజీ ఎంపీటీసీ సౌద్రి బసవరాజులు అన్నారు. మండల కేంద్రమైన కౌతాళంలో శనివారం టీడీపీ కార్యాలయంలో నాయకులతో కలిసి నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ రక్షణలో భాగంగా పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధంలో శత్రువులతో పోరాడి వీర మరణం పొందడం బాధాకరమని ఆయన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు కావడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ రాజానందు, కురువ వీరేష్, రామాంజినేయులు, నరసప్ప, రమేష్‌లు ఉన్నారు.,



కౌతాళంలో నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు: పాకిస్థాన్ ముష్కరుల తుపాకీ తూటలకు వీర మరణం పొందిన వీర జవాన్ మురళీనాయక్‌కు సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో శని వారం రోజు సోమప్ప సర్కిల్‌లో ఘన నివాళి అర్పించారు. ఈ సంద ర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, మంత్రాలయం నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్‌యాదవ్ మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా గోరంట్ల మండలం తళ్లితండాకు గ్రామానికి చెందిన రైతు బిడ్డ అయిన మురళీనాయక్ దేశం కోసం ప్రాణాలర్పించి దేశ చరిత్రలో నిలిచి పోయారని ఆయన కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు అండగా ఉండి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వీర మరణం పొందిన మురళీ నాయక్ కుటుంబానికి సీపీఐ పక్షాన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి సమీవుల్లా, నాయకులు దాదావలి,కేసి జబ్బర్, రాజీవ్, కాజా, రామాంజి,ఎల్లప్ప, షఫీ, గురురాజ్ ఉన్నారు



ఎమ్మిగనూరులో నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు